# తెలుగు జ్యోతి


## తెలుగు కళా సమితి వారి

ఉగాది-శ్రీరామనవమి ప్రత్యేక సంచిక - మార్చి - ఏప్రిల్ 2020



**Telugu Jyothi**
March - April 2020

A Literary Magazine from
**Telugu Fine Arts Society**


సిలికానాంధ్ర మనబడి
(WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)
10+ దేశాలు
30+ రాష్ట్రాలు
250+ ప్రాంతాలు
తెలుగు
చదవడం
వ్రాయడం
మాట్లాడడం
నేర్చుకోండి
12 సం||లు
55000+ విద్యార్థులు
1500+ భాషాసేవకులు
గుర్తింపు
• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
• అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
• ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు
పరీక్షలు
• ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు విశ్వవిద్యాలయం పరీక్షలు
• సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ
కార్యక్రమాలు
• పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, మనపద్యం, తెలుగుకుపరుగు, పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం, బాలరంజని(మొబైల్ యాప్).....
మనబడిలో చేర్పించండి!
తెలుగుభాష నేర్పించండి!!
Join ManaBadi - Learn Telugu
తెలుగు కళా సమితి (న్యూ జెర్సీ)
కుటుంబ సభ్యులందరికీ
దీపావళి శుభాకాంక్షలు!
తరగతులు
బాలబడి
ప్రవేశం
ప్రసూనం
ప్రకాశం
ప్రమోదం
ప్రభాసం
4-6 సం|| - బాలబడి
6+ సం || - ప్రవేశం
Visit : manabadi.siliconandhra.org
Email : manabadi@siliconandhra.org
Contact: 1-844-626-BADI (2234)
Follow us on : /SiliconAndhraManaBadi

## విషయ సూచిక


| | |
|---|---|
| అధ్యక్షుని కలం నుండి | 3 |
| సంపాదకీయం | 4 |
| తెలుగు కళా సమితి కార్యవర్గం | 6 |
| సున్న – ములుగు విశ్వనాథ శాస్త్రి | 10 |
| తల్లీ నిను దలంచి – జి. యస్. లక్ష్మి | 12 |
| జాగృత యుద్ధం – డా కావూరు బుష్ ★ | 15 |
| కరోనాతో పోరాడే శార్వరి – తొడుపునూరి శ్రీనివాస్ ★ | 15 |
| తెలుగు లోగిళ్ళలో ఉగాది – బోగా మనోహర ★ | 16 |
| శార్వరి పద్యం, గీతం – డా రాంభొట్ల పార్వతీశ్వర శర్మ ★ | 17 |
| అపార్ధం – కొమ్ముల వెంకట సూర్య నారాయణ | 18 |
| అప్పు చేసి పప్పు కూడు – పాకల శ్రీనాథ్ | 22 |
| జీవితం ఈజీ ఈక్వల్టు – రాంభక్త పద్మావతి | 25 |
| ఆకు రాలిన చోట – చొక్కర తాతారావు | 26 |
| తొలగిన మబ్బులు – పట్రాయుడు కాశీ విశ్వనాథం | 28 |
| మనప్రేమ – బులుసు లక్ష్మణ్ | 29 |
| నీ పిలుపే రాకపోతే ... – శ్రీనివాస్ గూడూరు ★ | 30 |
| ఆగిన గుండె – ఓట్ర ప్రకాష్ రావు | 31 |
| మూడో కోరిక – ఉప్పలూరి మధుపత్ర శైలజ | 33 |
| ప్రేరణ – దినవహి సత్యవతి | 39 |
| ఒక దీపం వెలిగింది – యలమర్తి అనూరాధ | 43 |


### From TFAS Events (December 2019 - April 2020)


| | |
|---|---|
| తెలుగు కళా సమితి నిర్వహించిన కార్యక్రమాలు (2018-20) | 7 |
| 2020 సంక్రాంతి పోటీలలో విజేతలు, చిత్రమాలిక | 8, 9, 11, 13 |
| తెలుగు కళా సమితి జమా ఖర్చులు | 14 |
| తెలుగు కళా సమితి ఈ మధ్య నిర్వహించిన కార్యక్రమాలు | 46 |


★ ఉగాది కవి సమ్మేళనంలో చదివిన కవితలు, పద్యాలు

**Opinions expressed in this volume are those of the authors and not of TFAS**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
9 Yardley Ct, Franklin Park, NJ 08823: http://www.tfas.net



**Board of Trustees 2018-2020**

**President**
**Sudhaker Uppala**
9 Yardley Ct,
Franklin Park, NJ 08823
(732) 491-6503
*president@tfas.net*

**Vice President**
**Ranga Madisetty**
5 Woodbury Ct,
Edison, NJ 08820
(732) 470-7055
*vicepresident@tfas.net*

**Secretary**
**Madhu Rachakulla**
14 Clemmens Ct
Edison, NJ 08820
(913) 220-9172
*secretary@tfas.net*

**Treasurer**
**Renu Tadepalli**
12 Mistflower Lane
Princeton Jn, NJ 08550
(732) 539-2848
*treasurer@tfas.net*

**Membership Services**
**Damu Gedala**
(856) 577-7112
*membership@tfas.net*

**Cultural & IT Services**
**Venu Yeluri**
(908) 397-7914
**Prameela Gopu**
(732) 670-6575
*events@tfas.net*
*it@tfas.net*

**Youth Services**
**Jyothi Gandi**
(732) 208-9599
*youth@tfas.net*

**Community Services**
**Usha Darisipudi**
(732) 718-4184
*community@tfas.net*

**Advisors**
**Anand Paluri (Chair)**
**Sudhaker Rayapudi**
**Ram Kolluri**
**Dr. Janani Krishna**
**Hari Eppanapally**

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


ఏప్రిల్ 30,2020

## అధ్యక్షుని కలం నుండి...

తెలుగు కళా సమితి సభ్యులకు, శ్రేయోభిలాషులందరికీ ఉగాది మరియు శ్రీరామ నవమి శుభాకాంక్షలు. మీ అందరూ క్షేమంగా మరియు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. కరోనా కరాళ నృత్యం అనూహ్య పరిణామం, దురదృష్టకరం. ఈ మహమ్మారి న్యూయార్క్ మరియు న్యూజర్సీ రాష్ట్రాలను అతలా కుతలం చేస్తోంది. సామాజిక దూరం పాటిచడం, ఇంటి దగ్గరే ఉండడం ద్వారా దీన్ని అరికట్టడం మనందరం చేయవలసిన పని. అతి త్వరలో ఈ covid-19 నుండి మనం విముక్తులవుతాం అని నా ఆశ. ఇలాంటి అనివార్య పరిస్తితుల్లో త్రిమూర్తి సంగీత కార్యక్రమం మరియు ఉగాది సంబరరాలు రద్దు చేయక తప్పలేదు. బహుశా తెలుగు కళా సమితి చరిత్రలో ఇది మొదటి సారి అనుకొంటాను. అలాగే తదుపరి ఎన్నికల ప్రక్రియను (ఓట్లు లెక్క బెట్టడం, కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయడం) కూడా వాయిదా వేయాల్సి వచ్చింది.

గత రెండు సంవత్సరాలుగా మీరు అందించిన సహాయ సహకారాలకు నా మనస్పూర్తి కృతజ్ఞతలు. ముఖ్యంగా ఆర్ధిక సహాయం అందజేసి, కార్యక్రమాల నిర్వహణకు సహాయం చేసిన దాతలకు, వివిధ సంస్థల నాయకులకు, సమితి సలహా సంఘ సభ్యులకు పేరు పేరున ధన్యవాదములు. అలాగే తెలుగు కళా సమితి నిధులను సరైన రీతిలో వృద్ధి చేస్తున్న Finance Committee సభ్యులకు, ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న Election Committee సభ్యులకు, By-Laws ను కూలంకషంగా అధ్యయనం చేసి మార్పులు/చేర్పులు చేసిన By-Laws Committee సభ్యులకు మరియు తెలుగు జ్యోతి సంపాదక వర్గ సభ్యులకు నా నమోవాకములు. నా తోటి కార్య వర్గ సభ్యులకు, కార్యక్రమాల్లో చేయూత నిచ్చిన యువతకు, స్వచ్ఛంద సేవకులకు నా కృతజ్ఞతలు.

ఈ కార్యవర్గం పదవీ కాలంలో 20కి పైగా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించాము. అలాగే తెలుగు జ్యోతి పత్రికను కూడా పునరుద్ధరించాము. ఇతర సంస్థలు నిర్వహించిన ఎన్నెన్నో కార్యక్రమాలకు తెలుగు కళా సమితి సహాయ సహకారాలు అందజేసింది. వీటి వివరాలు ఈ సంచికలో పొందుపరిచాము. దీపావళి మరియు సంక్రాంతి సంబరాల జమా ఖర్చుల వివరాలు, ఏప్రిల్ చివరి వరకు సంస్థ బ్యాంక్ ఖాతా వివరాలు (operating account) కూడా ఈ సంచికలో పొందుపరిచాము.

ఈ సంచికలో సంక్రాంతి సంబరాల వివరాలను, గత నాలుగు నెలల్లో చేసిన వివిధ కార్యక్రమాల flyers ను పొందుపరిచాము. ఈ మధ్యే జరిపిన శ్రీ శార్వరి కవి సమ్మేళనంలో (zoom ద్వారా) వివిధ కవివర్యులు చదివిన కవితలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాము. సాహిత్యానికి పెద్ద పీఠ వేసిన ఈ సంచిక మీకు నచ్చుతుందని ఆశ.

తెలుగు కళా సమితికి అధ్యక్షునిగా గత రెండు సంవత్సరాలుగా పని చేయడం నా మహాభాగ్యంగా భావిస్తున్నాను. ఈ అవకాశాన్ని ఇచ్చిన సభ్యులందరికీ మరొక్కసారి ధన్యవాదములు.

మీ

**ఉప్పల అనంత సుధాకర్**

అధ్యక్షులు, తెలుగు కళా సమితి

# సంపాదకీయం



ఈ సంచిక సంకలనం మొదలైన జనవరి నెలలో Corona మహమ్మారి కరాళ నృత్యం ఎంత భయంకరమో తెలియ లేదు. ఐతే ఇప్పుడు తెలుస్తున్నది అంతకన్నా భయంకరమైన విషయం, అనేక దేశాల్లో అధికార వర్గాల అసమర్థతా, కొందఱు మతోన్మాదుల 'గాలిలో దీపం పెట్టి దేవుడిమీద భారం వేయమన్న' బాధ్యత లేని బోధనలు. భగవంతుడు మానవుడికిచ్చిన విజ్ఞానాన్ని వాడటం అనవసరమనీ, తప్పనీ, పాపమనీ అన్న ఈ దురాలోచనలు ఎప్పటికి మనల్ని వీడుతాయో కదా. ఐతే under developed/ developing country అని ఇంకా చెడ్డ పేరున్న మన భారత దేశం ఈ గడ్డు పరిస్థితిని చాలా సమర్థవంతంగా ఎదుర్కుంటున్నది. అది మనందఱికీ ఎంతో గర్వ పడవలసిన విషయం.

ఇక ఈ సంచికలో మీ కోసం:

**తల్లీ నిన్ను దలంచి**: ఈ కవిత మొదట చదివినప్పుడు, లక్ష్మి గారికెందుకింత నిరాశా భావం అనిపించింది. కానీ ఈ Covid 19 వాతావరణంలో వైద్య నిపుణుల్నీ వైజ్ఞానికుల్నీ అనుమానించి పరిహసిస్తున్న ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే నిరాశే సమంజసమేమో అనిపిస్తున్నది.

**ఆకు రాలిన చోట:** హరితాన్ని అంతులేకుండా అపహరిస్తున్న మానవాళికై ఒక కన్నీటి బొట్టు

**స్వప్న సుందరి**: ఒక అందమైన కవితకొక అందమైన మకుటం

**జీవితం ఈజ్ ఈక్వల్ టు:** ఏ యుగంలోనైనా "తప్పదు యుద్ధము బంధు నాశమున్...." ఆత్మీయుల మధ్యే కోపాలూ కక్షలూ కూడా ఎక్కువుంటాయంటారు!

**ఆగిన గుండె**: మఱొక హృదయ విదారక కవిత.

**మన ప్రేమ:** ఒక అందమైన భావ కవిత

**అపార్థం**: అక్కడో కాలూ ఇక్కడో కాలూ ఉన్న మన లాంటి ప్రవాస భారతీయులు ఆలోచించాల్సిన విషయం

**అప్పు చేసి పప్పు కూడు**: ఎంత ఖర్చు పెడ్తే Credit Card Company నుంచి అంత Cash Back వస్తుంది అని కూడా చెప్పి ఉంటుంది ఆ రజని, అనిపించింది నాకు

**తొలిగిన మబ్బులు**: జీవితంలో అన్ని ఆపదలూ అపార్థాలూ అంత తేలిగ్గా తీరి పోతే ఎంత బావుణ్ణు!

**మూడో కోరిక:** అన్నీ కోరికలు అలా తీర్చుకోగలిగిన ఆ శాస్త్రి గారెంత అదృష్టవంతులు !

**ప్రేరణ:** 'వినదగునెవ్వఋ చెప్పిన' అన్న సూక్తిని ఒక చందమామ కథ రూపేణా చెప్పారు కవయిత్రి

**ఒక దీపం వెలిగింది:** అందమైన ప్రేమ కథలా మొదలైన ఒక Cyber బలి పశువు కథ

## సంపాదక వర్గం

**ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (సంపాదకులు), లంకా వేంకట కృష్ణా రావు,**

**బొగ్గవరపు లవ కుశ, తాడేపల్లి కుమార్, సంగుభొట్ల లత**

## తెలుగు కళా సమితి ప్రతినిధులు

**దరిసిపూడి ఉష (ఉప-సంపాదకులు ), గండి జ్యోతి**

# Telugu Fine Arts Society

## Board of Trustees : 2018 - 2020




Sudhaker Uppala
President



Ranga Madisetty
Vice President



Madhu Rachakulla
Secretary



Renu Tadepalli
Treasurer



Venu Yeluri
Cultural & IT Chair



Prameela Gopu
Cultural & IT Chair



Jyothi Gandi
Youth Chair



Damu Gedala
Membership Chair



Usha Darisipudi
Community Chair


## Advisory Board




Anand Paluri
Chair



Ram Kolluri
Member



Sudhakar Rayapudi
Member



Dr. Janani Krishna
Member



Hari Eppanapally
Member


## Telugu Jyothi


Vignana Kumar Utukuri
Editor



# Events Organized
# by Current BoT (2018-2020)

| Date | Event/Program | In Association with |
|---|---|---|
| June 24, 2018 | Sangeetha Vibhavari | DTA |
| Aug 19, 2018 | Summer Picnic | |
| Sept 29, 2018 | Yoga for Beginners | Isha Foundation |
| Sept/Oct 2018 | Sports Competitions | |
| Oct/Nov 2018 | Cultural Competitions | |
| Nov 18, 2018 | Deepavali Celebrations | |
| Jan 27, 2019 | Sankranthi Celebrations | |
| March 31, 2019 | Trimurthy Day Celebrations | |
| April 20, 2019 | Ugadi Celebrations | |
| June 22, 2019 | Vihangam Yoga for Beginners | Vihangam Yoga |
| July 14 - 20 | Summer Art Workshop | |
| July 28, 2019 | Literary Event | TANA |
| Aug 4, 2019 | Summer Picnic | |
| Sept 22, 2019 | Veena Concert | |
| Sept/Oct 2019 | Sports Competitions | |
| Oct 2019 | Cultural Competitions | |
| Nov 16, 2019 | Deepavali Celebrations | |
| Dec 8, 2019 | Ashtavadhanam | |
| Jan 26, 2020 | Sankranthi Celebrations | |
| Feb 29, 2020 | CPR Training | TANA |
| April 14, 2020 | COVID-19 Webinar | |
| April 26, 2020 | Ugadi Literary Event | |

2020 Trimurthy Day and Ugadi Celebrations are cancelled due to COVID-19

## TFAS 2020 Sankranthi Celebrations : Prize Winners

| Posters Competitions | | |
|---|---|---|
| Seniors | Special Prize | Anjali Vishwanathan |
| Juniors | First Prize | Srija Boddu |
| | Second Prize | Saanvi Dasari |
| | Third Prize | Agatsya Janapareddy |

| Muggulu (Rangoli) Competitions | | |
|---|---|---|
| Sub- | First Prize | Sharini Vemireddy |
| | Second Prize | Srikar Majeti |
| | Third Prize | Puruhootika Nookala |
| Juniors | First Prize | Srija Boddu |
| | Second Prize | Tanvisai Karamsetty |
| | Third Prize | Pranavi Jonnalagadda |
| Seniors | Special Prize | Anjali Viswanathan |
| Adults | First Prize | Radhika Dasari |
| | Second Prize | Vijayalakshmi Kolisetty |
| | Third Prize | Padmaja Kadiyala |

| Pindi Vantalu Competitions | | |
|---|---|---|
| Adults | First Prize | Chandra Tammineedi |
| | Second Prize | Arunalatha Tamma |
| | Third Prize | Basavalakshmi Katepalli |
| | Third Prize | Radha Virupaksha |

| Fancy Dress Competitions | | |
|---|---|---|
| Sub- | First Prize | Srihith Majeti |
| | Second Prize | Harshika Pasunuri |
| | Third Prize | Krish Venkata |
| | Special Prize | Sharini Vemireddy |

| Telugu Poem Recitation Competitions | | |
|---|---|---|
| Seniors | First Prize | Laya Neelisetty |
| | Second Prize | Sidhardh Thamma |
| Juniors | First Prize | Srija Boddu |
| | Second Prize | Divya Suri |
| | Third Prize | Deepthi Suri |
| Sub-Juniors | First Prize | Purohitha Nookala |
| | Second Prize | Sanvi Boddu |

| Telugu Reading Competitions | | |
|---|---|---|
| Seniors | First Prize | Laya Neelisetty |
| | Second Prize | Pranav Manikonda |
| Juniors | First Prize | Srija Boddu |
| | Second Prize | Sravanthi Manikonda |
| | Third Prize | Nishitha Aerroju |
| Sub-Juniors | Special Prize | Purohitha Nookala |

| Telugu Speaking Competitions | | |
|---|---|---|
| Seniors | Special Prize | Laya Neelisetty |
| Juniors | First Prize | Deepti Suri |
| | Second Prize | Srija Boddu |
| | Third Prize | Abhiram Thammana |
| Sub-Juniors | First Prize | Purohitha Nookala |
| | Second Prize | Sharini Vemireddy |
| | Third Prize | Anushri Appana |

# సంక్రాంతి సంబరాలు : జనవరి 26, 2020 : చిత్రమాలిక














*000000000000000000000000000000000000*

# సున్న

ములుగు విశ్వ నాధ శాస్త్రి

*000000000000000000000000000000000000*

0 కి విలువెంత అని **పంతుల్ని** అడిగితే
**సున్నా** కి విలువేంటి? **శూన్యం** అంటాడు!
0 లేకుండా
**పంతులూ** లేడు! ఏ **పండితుడూ** లేడు!

**అంకెల** దరిజేరి అది విలువలను పెంచు!
పదముల దరిజేరి పదార్థములనే కూర్చు!

**సున్న** ప్రక్కన 0 చేరి **సున్నం** అయ్యె!
**అన్న** ప్రక్కన 0 చేరి **అన్నం** అయ్యె!
**ఆంధ్రా** లో **అన్నబియ్యం** కూడా కిలో **రెండు** అయ్యె!

**పది** మధ్యలో దూరి **పంది** గా మారె!
**నది** మధ్యలో దూకి **నంది** గా మారె!

ప్రతి **కొంప** లోనూ అది తిష్ట వేసింది!
0 లేనట్టి **సంసారమే** లేదు!

**కాంగి** లోనూ దూరె!
**దేశం** లోనూ దూరె!
**కమలం** లోనూ దూరే !
అది **రాజకీయం** కూడా నడుపుచుండె!
**పంచాయతీ** నుండి **పార్లమెంటు** వరకూ అది మెంబరై ఉండ!

**గుండుసున్నా** అని ఎగతాళి చేయకు
**గూండా** గా మారి రుబాబు చేయు!

**ఆరంభము** న 0! **అంత** మందున 0!
**జననం**లో 0!
**మరణం**లో 0!
**శూన్యం**లో 0! **అనంతము**లో 0!

**ఇందూ**, **అందూ** అను సందేహమేల!
**అండ**, **పిండ**, **బ్రహ్మాండము** లలో 0!
**సత్యం**, **శివం**, **సుందరం**
అన్నింటిలోనూ అది అలరారుతోంది!

0 తోటే ఉంది
**అందం**! **ఆనందం**!
**జీవితం**లో చివరకి మిగిలేది 0 !

**గోవిందా**! **ముకుందా**! **శంభో**! **శంకరా**!
**సున్నాలు** గలవే ఈ భగవన్నామాలు అన్నీ!
**ఏడుకొండల** వాడా! **వెంకట** రమణా!
నీకు నామాలతో పాటు అందు **సున్నాలు** లేవా!

తిరుపతిలో ఎక్కు ప్రతి **కొండ** లోనూ 0!
తిరిగి దిగి వచ్చు ప్రతి **గుండు** లోనూ 0!

ఇంత మహిమ గల 0 –
మరి **గుడి** లోను లేదని, **బడి** లోను లేదని
దిగులెందుకన్నా!

**గుడి**లోన జేరి **గుండి**గా,
**బడి**లోన జేరి **బండి**గా మారడం దాని **అభిమతం** కానే కాదన్నా!

కనుక గుడి **గంట**లో చేరి, బడి **గంట**లోనూ చేరి
మోత మోగిస్తోందన్నా!
ఆ మోత **నాదం** లోనూ 0!

**కాలం**తోటే అది పరుగులిడుతోంది!
ప్రతి **గంట**, ప్రతి **దినం**,
ప్రతి **వారం**, ప్రతి **పక్షం**,
ప్రతి **మాసం**, ప్రతి **సంవత్సరం**,
అన్నిటా ఉండి **కాలచక్రం**ను అది తిప్పుతోంది!

**వారం**, **వర్జ్యం** అంటూ, **గ్రహం** – **గ్రహణం** అంటూ
**పంచాంగం** అంతా **సున్నాల** మయమే!

**దేహం**తోటే అది అంటిపెట్టుకుని ఉండె!
**కంటి**లోనూ 0! **పంటి**లోనూ 0!
**కంఠ**లో 0! **కండరం**లో 0!
**చర్మం**లో 0! **రక్తం**లో 0!

**దాహం**లో 0! **మోహం**లో 0!
**రాగం**లో 0! **అనురాగం**లో 0!
**సరసం**లో 0! **విరసం**లో 0!
**కామం**లో 0! **క్రోధం**లో 0!
**నరనరం**లో అది **జీర్ణించుకుని** పోయె!

**రోగం**లో 0 ! దానికి చేసే **వైద్యం**లో 0!
**అంగాంగము**న 0 అంటిపెట్టుకుని ఉండ
**దేహం**తోటే అది దహనమగుననిపించె!
తీరా చితా **భస్మం** చూడ అందు కూడ కనిపించె!
మన గతులనే మార్చివేసి అది **గంతు**లేస్తోంది!

"జయహో సున్నా
జయ జయహోసున్నా!!
*0000000000000000000000000000*

***ఈ సున్నా కవిత చదవగానే నాకు గుర్తొచ్చింది ఈశావాస్యోపనిషత్తు మొదటి శ్లోకం***

ఓం పూర్ణమద: పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ||

పూర్ణశ్య పూర్ణమాదాయ పూర్ణమేవ అవశిష్యతే ||

ఓం శాంతిః శాంతిః శాంతిః ||

# సంక్రాంతి సంబరాలు : జనవరి 26, 2020 : చిత్రమాలిక















# తల్లీ...నిన్ను దలంచి...

జి.యస్.లక్ష్మి

తల్లీ.... భారతి....
నిన్ను తలంచి నేను పట్టిన పొత్తము ఈ విధి
భంగమయ్యె
ఏమని చెప్పుదు నాదు దుస్థితిన్...

ఉదయమున నిను దలంతునన్న
అరుణకిరణములు సోకని వాసమయ్యె
మనసు మూగబోయి మౌని నైతి.......

చైతన్యమున పట్టువిడక
నీదుగురించి నాల్గు వాక్యముల్ చెప్పుదమన్న
వినెడి మానవు డెందును కానరాడు.......

నిను తనివార పూజింప విరిసిన కుసుమములకై
బోవ
హతవిధీ.. ఏమని చెప్పుదు ఎచట కాంచిన
కృత్రిమపూల గుత్తులె కానపడియె.....

వేద విజ్ఞానఖని అయిన అమృతభాండము ఎదుట
నుండగ
ఎండమావికై పరుగులిడు యాతన
ఈ పిచ్చి జనులు చేయుటెందుకో
తెలియరాదయ్యె...

మదిని కలవరమ్ముతో,
తెగని పట్టుదలతో,
ఎటులైన నీదు మహిమలు,
నిను పఠించిన పొసగు మహానందములు,
నీదు దీవెనచే కలుగు పుణ్యములు,
నీదుపై ఏకాగ్రతతో కలుగు అద్వైత సిద్ధి,
మనఃపీఠమున నిను స్థాపించిన పొందు కైవల్యము,
మరి ఎందును కానరాదని తెలియచెప్పుదునన్న
ఏమి పాపము చేసితినో గాని
వినెడివారు కరవైరి...ఏమనందు...

తల్లీ...భారతీ..నిను కొలవగలేని దౌర్భాగ్యపు జాతి
అయిన
ఈ జనుల మనమున తిమిరము హరము చేసి
వెలుగు చూపి బ్రోచు తల్లివి నీవె గదమ్మ.
చలము సేయక
నీవు మమ్ము చల్లగ చూసి
పెడదారి పట్టిన పిలవాని త్రోవ మార్చి
అక్కున చేర్చి బ్రోవుమా, తల్లి శారదా!

---


**Allstate**
You're in good hands.

**Venkat Malladi**
Agency Owner
Astute Financial Services, LLC

**Allstate Insurance Company**
123 Morris Street
Morristown, NJ 07960

Office 9736319700
Cell 7322667983
Fax 9735389022
venkatmalladi@allstate.com
www.allstate.com/venkatmalladi



**Your trusted Allstate advisor**



# సంక్రాంతి సంబరాలు

## జనవరి 26, 2020

## చిత్రమాలిక


















## Telugu Fine Arts Society

### Event Accounts (Nov 2019 - April 2020) & Overall Summary

| Event Organized | Income | Expense | Profit/(Loss) |
|---|---|---|---|
| Diwali (November 16, 2019) | $36,850 | $33,550 | $3,300 |
| Ashtavadhanam (December 8, 2019) | $1,485 | $1,700 | ($215) |
| Sankranthi (January 26, 2020) | $3,640 | $4,350 | ($710) |

### Overall Accounts Status as of April 30, 2020 (Operating accounts)

| | | |
|---|---|---|
| Bank Balance | $44,000 | (PNC & Investors) |
| Receipts Due | $1,000 | (from Ananda Mandir—deposits) |
| Memberships | - $5,400 | (need to be transferred to Endowments account) |
| Payments Due | - $3,600 | (including $2,000 donation for COVID-19 fund) |
| **Balance** | **$36,000** | |

## Events/Programs Supported by TFAS (2018-2020)

Vegesna Foundation Cine Gana Vibhavari : June 9, 2018
TANA Vesavi Vennela Workshop (by Dr. Shobha Raju) July 23 - 27
DSP Live Show : Sept 8, 2018
Bhakta Prahlada Dance Drama by Sri Ananda Natyalayam : Sept 13, 2018
TATA Bathukamma Celebrations : Oct 13, 2018
NJ Bathukamma Celebrations : Oct 13, 2018
TANA/LMA Music Training Workshop : Aug 19 - 30, 2019
TANA Literary Event with Medasani Mohan garu : Aug 25, 2019
Sankara Netralaya NJ Launch : Sept 7, 2019
NJ Bathukamma Celebrations : Sept 28, 2019
TATA Bathukamma Celebrations : Oct 5, 2019
Serve Food to homeless people with SDP : Dec 2019

## జాగృత యుద్ధం

- డా. బుష్ కావూరు

కనపడకుండా కదిలే శత్రువు
మానవళికే ముప్పు తెచ్చెను
మృత్యునీడలా ముసుగున దాగి
మాటు మాటున మసలు చున్నది

దొమ్మిలో దిగిన ధన్వంతరులు
సాహసించిన సిస్టరమ్మలు
గొరిల్లా యుద్ధం
హాహా కారం
నేల కొరిగిన రోగుల బారులు

పౌరుషానికి మారుపేరులం
ఓటమి ఎరుగని జాతి పుంజులం
రక్తం చిందినా విరక్తి చెందమ్
శవలామైన సవాల్ మానం

వైద్యుల్లారా వీరుల్లారా
ఊపిరి నిలిపే ధీరుల్లారా
సైన్స్ ల్యాబ్ లో సైనికులారా
ఖార్ఖనాలో కార్మికులారా
కలసి కట్టుగా ముట్టడి చేద్దాం
కరోనా వైరస్ కట్టడి చేద్దాం

మృత్యువు కోరలు వంచే వాళ్ళం
మానవ మనుగడ నిలిపె వారం
వైరస్ వారులో విజయం మనదే
గెలుపు పిలుపులో నాదం మనదే

పుడమి తల్లి కి
ప్రకృతి కన్యకి
మారిన మనుషుల మమతలు పంచి
మనసుల మల్లెల మాలలు వేద్దాం

అసువులు బాసిన -అమర యోధులకి
విజయ రీతిన హారతులిద్దాం
తనువులు దాల్చిన త్యాగమూర్తులకు
శిరస్సు వంచి సలాం చేద్దాం

## కరోనాతో పోరాడే శార్వరి

- శ్రీనివాస్ తొడుపునూరి

### Before Covid-19 (Before Ugadi)

కారు మబ్బులు కమ్మి రావాలి వర్షాల జోరు
కష్టాలు కడతేరి ఆగాలి రైతన్నల పోరు
కనకంగా పండాలి గోధుమ, జొన్న మరి వరి
కరుణతో కటాక్షించు మా తల్లి శార్వరి

సమతుల్యంగా ఉండాలి ఆదాయం వ్యయం
అనుకూలంగా ఉండాలి గ్రహ బలం
కలతలు లేకుండ సాగాలి కాపురం
సుఖ శాంతులతో నిండాలీ సంవత్సరం

### After Covid-19 starts spreading and before lockdown

కనిపించని దయ్యమై కలచి వేసింది
కనికరం లేకుండా అణచి వేసింది
సప్త సముద్రాలు దాటి విషము చిమ్మింది
మానవ మనుగడకే ప్రశ్న వేసింది

విమానాలు ఎక్కింది నావలలలో నడిచింది
ఖండ ఖండాంతరాలు చేరింది
దిన దిన గ్రహణమై గుళ్ళనే మూసింది
వైద్యశాలలనే రణ రంగాలుగా మార్చింది

సామజిక దూరంతో మ్రోగిద్దాం యుద్ధభేరి
గృహనిర్బంధన ఆయుధంగా పెడదాం గురి
మూడు వారాల దీక్షతో తగిలిద్దాం దానికి ఉరి
భయ భ్రాంతులను వీడి పీలుద్దాం ఊపిరి
కరుణతో కటాక్షించు మా తల్లి శార్వరి

# తెలుగు లోగిళ్ల ఉగాది పండుగ

– మనోహర బోగా

కొమ్మల చివరన చేరిన చిలకమ్మల సందడి
గువ్వల గూటిలో కలకలం
ఆ కలకలం తెలుగు వాడికి పండగ ఐతే
ఉషస్సులతోఉగాది ఉషోదయం

పక్షుల కిలకిల రావాలు
చిగురులు వేసి మొగ్గలు తొడిగే కాలం
ఆకురాలే శిశిర కాలం పోయి
చైత్రమాసం ప్రారంభం
వేపపూవు,మామిడిపిందెలు ఎటూ చూసినా పచ్చదనం
ప్రకృతమ్మ కలకలలాడుతూ మళ్ళీ యుగానికి
ఆరంభం పలకటమే ఉగాది...!

ఉషస్సుల ఉగాదికి స్వాగతం,సుస్వాగతం...!
లేత పచ్చని కొమ్మల చిగురుల
లేత మామిడి పిందెలు ఆ పిందెలు నడుమున
వేలాడుతున్న చిలకమ్మలు
పచ్చదనం పరిమిళించిన గుబురుటాకుల మధ్యన
గుబాళించిన తెల్లని వేప పువ్వు||

ఆడపిల్లలు-పట్టు పరికిణిలు
ఇల్లంతా కోలాహలం
గడపలు పచ్చని తోరణలతో అలంకరించబడి
పంచాంగ శ్రవణాలు వినిపిస్తుంటే
ఆసక్తిగా బామ్మ-తాతగారి రాశి ఫలాల సమీకరణ
అన్ని రుచులు ఏకమై
షడ్రుచులుగా మారి ఉగాది పచ్చడైతే
ఎంత అద్భుతం!!

దేశభాషలలో తెలుగు లెస్స
తెలుగు పండుగలలో ఉగాది మేలుమేలు(బహు మేలు)
పచ్చదనం,సోయగం నింపుకున్న
ఉగది అంతే ఏ తెలుగు వాడికి ఇస్తం ఉందదు చెప్పండి....?
అందుకే ఉగాది తెలుగు లోగిల్లలో తెలుగుతనం
ఉట్టిపడే మనందరి పండుగ.
ఉగాది పరచిన పచ్చదనం
తెలుగు తల్లి మెడలో మాల చేస్తూ
శ్రీ శార్వరినామ సంవత్సర ఉగాదిని ఆహ్వానిద్దాం
జై తెలుగు తల్లి జై జై తెలుగు తల్లి.

---

# స్వయం కృషి

– కృష్ణ స్వయంపాకుల

పరిగెత్తి పది మైళ్ళు పాలు తాగెకన్నా....
నిలుచున్న చోటె నువ్వు నీళ్ళు తాగరన్న....

కనపడితే చేతులూపి హాయ్ హలో కన్నా....
ఆరడుగుల దూరంతో దండమెట్టరన్న....

మనవాళ్ళు మనచుట్టూ ఎంతమంది ఉన్నా....
నీకు నువ్వు ఒంటరయ్యే సమయమెంతో మిన్న...

దేశమంటె మనుషులోయ్ మట్టి కాదురన్నా....
మనమంతా ఒక్కటైతె ఆ మహమ్మారి సున్నా....

ఎలుగెత్తి చాటె వారెంతమంది ఉన్నా...
నీకు నువ్వు తెలుసుకుంటె అదే కదా మిన్న....

దేవుడికి దండమెట్టి మొక్కుకోర నాన్న....
కరోనాలెన్నొచ్చినా ధైర్యమొదలకన్నా.....

# శార్వరి పద్యం—ఉగాది గీతం

– శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ



అర్చావతారమౌ అల వేంకటేశుని
  చూడంగబోయెడు వాడు లేడు!
ఈ అక్షయ తృతీయ కెటు నిజరూప – వ
  రాహ నృసింహుని ఊహలేదు!
మనిషి మనిషిజూచి మన్నించు కొనుటలే
  మాయమై – కలిసెడి హాయి లేదు
అవధాన కోకిల మాకొమ్మ నీకొమ్మ
  రవళింపగా చైత్ర లక్ష్మి లేదు!
పూత "శార్వరి" భయదప్రపూతమయ్యె
కాని! కవితల అమృతమ్ము కాంచ వచ్చి
ఖండ ఖండాంతరాలలో కాంక్ష హెచ్చె
ఇది తెలుగు కళా సమితిచే పదిలమయ్యె!

******

(సంగీతం, గాత్రం: శ్రీమతి కరి యామినీ కృష్ణ)

పల్లవి
శ్రీ
పికశృతిలహరీ!
సుకవితల ఝరీ!
తొలిచివురుల
కలికివలపుతెలుపు శార్వరీ!

జతలసాగసరీ
జతుల సురకరీ
నతులతతులు
కృతులసతము అతుల శార్వరీ!

చ.
తారకాధ్వసారచాంద్రి
సుమధురరసధునిధని షాట్పదీయగానసాంద్రి
హరిపదవిరజామల
భావయోగరాగభాగ్యదాయినీ!
వర్షరాజ్ఞి
నీ...వే....కా....వే...  ||పికశృతిలహరీ||

చ.
భూతజాలపూతకీర్తి
హరితవనమహితగుణి
స్మేరహారభూరిమూర్తి
బుధజన హృదయాంచిత
దివ్యదవ్యయావిభాసితాంగి! స
ర్వర్తురాజ్ఞి
నీ...వే....కా....వే....  ||పికశృతిలహరీ||

# అపార్థం

## కొమ్ముల వెంకట సూర్యనారాయణ

"ఉత్తరం" అనే దాన్ని చూసి చాలా కాలమైన తర్వాత ఈ రోజు కొత్తగా టేబిల్ పై ఉత్తరాన్ని చూసేసరికి బహుశా తప్పు అడ్రెస్ అయివుంటుందనుకుంది రాధ. తీరా చూసేసరికి తన భర్త రవి పేరుతో, అక్షరాలా తమ చిరునామాతోనే ఉంది. పంపిన వారి అడ్రెస్ లో ఏమి రాసి లేకపోవటంతో ఎవరై ఉంటారబ్బా అని ఆలోచిస్తూ, మంచానికే పరిమితమైపోయిన రవి చేతికి ఇవ్వాలా వద్దా అని ఒక్క క్షణం ఆలోచించి ఆ ఉత్తరాన్ని చింపిచూసింది. ఆ ఉత్తరం రవినుద్దేశించి తన అత్తగారు రాసిన ఉత్తరం. అక్షరాల వెంబడి రాధ కళ్ళు పరిగెత్తాయి.

రవీ! ఈ ఇంటర్నెట్ యుగంలో కూడా అమ్మ ఉత్తరం వ్రాసిందేంటి అనుకొంటున్నావు కదూ! మనసు విప్పి మాట్లాడాలనే ఈ ఉత్తరం. ఏరా రవీ, ఇక్కడ ఉన్నంత కాలం అమ్మానాన్నలంటే ఎంతో అభిమానంగా ఉండేవాడివి. అక్కడికి వెళ్ళిన తరువాత ఐదారేళ్ళు ఫోన్ లో నయినా ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడివి. మనవడితోకూడా నువ్వూ, కోడలు ఒకసారి వచ్చారు. తర్వాత్తర్వాత నువ్వు ఫోన్ లో కూడా పలకరించడం గగనమైపోయింది. నెలనెలా ఇప్పటికీ డబ్బు పంపిస్తున్నావు, కానీ డబ్బుతో ఆప్యాయతలు ఎంతవరకు నిలుస్తాయిరా. ఎంత బిజీ అయిపోయావంటే నాన్న చనిపోయినా నీ బిజీ షెడ్యూల్ లో రాలేకపోయేంత. రాలేకపోయినందుకు కాదురా, నాన్నంటే ఏంటో నీకు తెలియజేయాలనే రా ఈ ఉత్తరం. పూర్తిగా చదవకుండా ప్రక్కకు పెట్టేయకు.

నాకు హాస్పిటల్ అన్నా, మందులన్నా ఎంతో భయం అని నీకు తెలుసుకదా! నీకు ఎంత అనారోగ్యం చేసినా నాన్నే కదా హాస్పిటల్ కి తీసుకెళ్ళే వారు. నువ్వు కడుపులో పడినపుడు, నేను ఈ హాస్పిటల్స్ కి వెళ్ళటానికి, మందులు వేసుకోవటానికి భయపడి అబార్షన్ చేయించుకొని ఎవరినైనా పెంచుకుందాం అంటే పురుడు పోసుకోవాల్సిన జీవాన్ని చంపే హక్కు మనకు ఎవరిచ్చారు అని చెప్పి ఎంత మాత్రం మీ నాన్న అంగీకరించక దగ్గరుండి ఎంతో జాగ్రత్త తీసుకోవడంతో నువ్వు పుట్టావు. నాన్న గట్టిగా పట్టుపట్టకపోతే ఆ రోజే నీవు లేవు, అది నీకు ఇప్పటి వరకు తెలియని పచ్చినిజం.

మొట్టమొదటిసారి రాధకి తెలిసిన నిజం. అప్రయత్నంగా ఆమె కంటినుండి కన్నీటి చుక్కలు రాలి ఉత్తరాన్ని తడిపేస్తున్నాయి. ఉత్తరాన్ని చదవటం కొనసాగించింది.

ఆ తరువాత కూడా నిన్ను ఎలా పెంచారనుకొంటున్నావు? నువ్వు బుడిబుడి అడుగులు వేయడం మొదలుపెట్టిన తరువాత నాన్న నీ పాదాలు నేల మీద పెట్టనివ్వకుండా, తన రెండు అరచేతులను నేలపై ఉంచి ఒక అరచేతిలో నీ పాదం ను ఆనించుకొని, మరొక అరచేతిని కొంచెం ముందుకు ఉంచి నీ మరో పాదాన్ని ఆ అరచేతిపై ఆనించుకొని అలా నిన్ను నడిపించే వారు, ఎక్కడ నీ పాదాలు కందిపోతాయో అనే కాదు, నీ మీద వల్లమాలిన ప్రేమతో.

కొంచెం పెద్ద అయిన తరువాత నిన్ను సైకిల్ పై ఎక్కడకన్నా తీసుకెళ్ళాలంటే సైకిల్ వెనుక కేరేజ్ పై కూర్చోపెట్టి తీసుకెళితే ఎక్కడ సైకిల్ చక్రాలలో నీ కాళ్ళు పెట్టుకుంటావో అని సీట్ ముందు రాడ్ కి టర్కీ టవల్ ని నాలుగైదు చుట్లు చుట్టి దానిపై నిన్ను కూర్చోపెట్టి తీసుకెళ్ళేవారు. మరి నీకు అది గుర్తుందో లేదో!

"రాధ మనసు అపరాధభావంతో కన్నీటి రూపంలో ఉత్తరంలోని అక్షరాలను అలికేస్తున్నాయి"

అలాగే ఒకసారి నీకు చికెన్ పాక్స్ చాలా ఎక్కువగా వస్తే దగ్గరుండి ఆయనే మందులు వేస్తూ ప్రక్క దుప్పట్లు మారుస్తూ ఎప్పటి కప్పుడు స్నానం చేయిస్తూవచ్చారు, చివరికి నీకు తగ్గేసరికి మీ నాన్నకి చికెన్ పాక్స్ వచ్చింది. అయినా ఆయన మనలను ఎవరిని దగ్గరకు రానీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకొన్నారు.

నాన్న స్థోమత సరిపోనప్పటికి నువ్వు మంచి చదువులు చదివి ఉన్నత స్థానానికి వెళ్ళాలని తాహతుకు మించి మంచి ప్రైవేట్ కాన్వెంట్ లో చేర్పించి చదివించారు. దానికోసం మీ నాన్న ఓవర్ టైమ్ చేసి చేజేతులా తన ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నారు.

అంతేకాదు నీకు ఇప్పటికి తెలీని విషయం ఒకటి చెప్పనా, మీ నాన్న చిన్నప్పుడే, మీ నాన్నమ్మ చనిపోతే మీ అత్త అదే మీ నాన్న అక్కే మీ నాన్నను తల్లిలా పెంచి పెద్దచేసిందని అందుకే అత్త కూతురుని నీకు చేయాలని ఎంతో తహతహలాడేవారు, కానీ నువ్వు ఎవరో అమ్మాయిని ప్రేమించావని చెప్పేసరికి అతి కష్టం మీద మీ అత్తకూతురుని చేయాలనే తలంపుని మానుకుని నీవు ప్రేమించిన అమ్మాయి తల్లితండ్రులు అదే మీ అత్తమామలను, నీకు వాళ్ళ అమ్మాయిని చేయమని అడగటానికి వెళితే నాన్న మొహం మీదే "మీ అంతస్తు ఎక్కడ, మా అంతస్తు ఎక్కడ అని హేళన చేయడమే కాకుండా, అంతగా మా అమ్మాయిని మీ అబ్బాయికిచ్చి పెళ్ళి చేయాలంటే, మీ అబ్బాయిని ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగం సంపాదించుకోవడమే కాకుండా నేనూ, మీ నాన్న నీ దగ్గర

ఉండకూడదు అనే కండిషన్ కి అంగీకరిస్తే నే పెళ్ళి చేస్తా"నన్నారు, దానికి తనలో తనే బాధపడ్డారే తప్పితే ఒక్క మాట నీ దగ్గర ఏమైనా చెప్పారా? అది దృష్టిలో ఉంచుకుని ఎంత వద్దని చెప్పినా వినకుండా మనకు ఉన్న ఆ కొద్ది పాటి పొలాన్ని అమ్మి నీ ఉన్నత చదువుకు వెచ్చించారు. ఆ తర్వాత నీకు వచ్చిన మంచి జాబ్ ను చూసి నువ్వు ప్రేమించిన ఆ అమ్మాయి తో పెళ్ళి చేయడానికి ముందుకొచ్చారు నీ అత్తమామలు, అయితే ఎక్కడ అంతకుముందు జరిగిన విషయాలు నీకు చెప్పి పెళ్ళి చేయకుండా చేస్తారేమోనని భయపడి ఎంతగానో నాన్నను బతిమాలుకున్నారు కాని నాన్న నీకెప్పుడైనా ఈ విషయాల గురించి ఒక్క ముక్కైనా చెప్పారా?కనీసం కోడలితో మాట వరసకు కూడా ఒక్క మాట తెలియనివ్వలేదు. అదిరా నాన్న అంటే.

"తనకు తెలియని తన తల్లితండ్రుల మనస్థత్వం గురించిన పచ్చి నిజం. అప్రయత్నంగా కనుకొనకులనుండి జారిపోతున్న కన్నీటి చుక్కలు".

నువ్వు ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్ళిపోతానంటే, అవసానదశలో ఆదుకోవలసిన ఒక్కగానొక్క కొడుకు విదేశీ బాట పడతానంటే నీ ఉన్నతికి ఎక్కడ ఆటంకం ఏర్పడుతుందోనని మనసులోనే తన బాధను దిగమింగుకుని నిన్ను సాగనంపారురా.

ఈ మధ్యలో ఎన్నో సార్లు మీ నాన్నకు జబ్బుచేస్తే కనీసం నీకు తెలియచేయనివ్వలేదు కూడా, ఎందుకంటే అక్కడినుంచి ప్రయాసపడి రావాల్సివస్తుందని.

చివరిసారిగా మీ నాన్నకు తీవ్రమైన గుండెనొప్పితో బాధపడుతున్నపుడు కూడా నిన్నురమ్మని కబురు చేయమని చెప్పలేదు కాని నాకే మనసొప్పక నీకు ఫోన్ చేస్తే నీవు ఉద్యోగ పని మీద ఎక్కడికో వెళ్ళావని రావటానికి వారం రోజుల పైనే పడుతుందని కోడలు చెప్పింది.

ఆయన చనిపోతూ అన్న మాటలు నువ్వు వింటేనైనా నీ మనసు చలిస్తుందేమో! అవేంటో తెలుసా

"నేను ఎలా పెంచానో తెలియదుగానీ నా కొడుకు నాకు దగ్గర కాలేకపోయాడు, కానీ నా కొడుకుని నా మనవడు తన దగ్గరే ఉంచుకునేలా పెంచితే బాగుణ్ణు అంటూ చివరి క్షణంలో కూడా నీ క్షేమాన్నే కోరుకున్నారురా"

ఉత్తరాన్ని చదివి ఎక్కడో అట్టడుగుపొరల్లో దాగిఉన్న మానవత్వం దూసుకొచ్చి స్వగ్రామం వద్దామనుకున్నా నీవచ్చేసరికి నా కట్టె కూడా మిగలదు, ఎందుకంటే నాకు చివరి క్షణాలు దగ్గరపడ్డాయి. అందుకే తనకోసం ఏమీ ఆశించని మీ నాన్న, నీ క్షేమాన్నే ఆశించిన విధంగా నీ కొడుకు నిన్ను దూరం చేసుకునే లా కాకుండా పెంచు.

ఇట్లు

అమ్మ

ఉత్తరం పూర్తిగా తడిసి ముద్దయింది. ఆ ఉత్తరాన్ని అంతకన్నా పూర్తిగా తడిసి ముద్దయిలా చేసింది తను అత్తామామలకు తెలియనివ్వని అసలు నిజం. అత్త, మామల దృష్టిలో తన భర్త ఒక దుర్మార్గుడైన కొడుకుగా మిగిలిపోయాడనే బాధ, కనీసం ఆ నిజాన్ని ఇపుడు చెప్పడానికి కూడా లేకుండా పోయారనే బాధతో ఒక్కసారిగా తీవ్రమైన వేధనతో పరితపించిపోయింది. ఒక విధంగా వీటన్నింటికి తనే ఒక కారణం అనే ఆలోచన వచ్చేసరికి మరింత గా కుంగిపోయింది. అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ గతంలోకి జారుకుంది.

*** *** *** ***

అప్పటికి తన భర్త ఉద్యోగరీత్యా విదేశానికి వచ్చి ఐదేళ్ళు పైబడి అయిపోయింది. ఈలోపు తమకి కొడుకు పుట్టడం, మధ్యలో ఒకసారి కొడుకుతో సహా ఇండియా వెళ్ళటం జరిగింది. అత్తమామలు అన్ని విషయాలలోను బానే ఉండేవారు కానీ ఇండియాలో తన భర్త ఉద్యోగం చేసేటపుడు తాము ఉండే ఇంటికి రమ్మన్నా, విదేశానికి వెళ్ళిన తర్వాత అక్కడకు రమ్మన్నా ఎప్పుడూ వచ్చింది లేదు. ఎందుకు వచ్చే వారుకాదో ఎప్పుడూ అర్థమయ్యేది కాదు, తన భర్తని అడిగినా "ఏమో నాకూ తెలియదు అనేవాడు". ఇప్పుడు అర్థమైంది దానికి కారణం తన అమ్మానాన్నల నిర్వాకమని.

అలా సాఫీగా సాగిపోతున్న తమ జీవితాలను కుదిపేసిన ఒక కుదుపు. ఆ రోజు ఇంకా గుర్తుంది. తన కొడుకుని కాన్వెంట్ కి పంపిన అరగంటకు భర్తని ఆఫీస్ కి సాగనంపింది. ఇలా అరగంట గడిచిందో లేదో ఆఫీస్ నుంచి ఫోన్. "మీ వారికి ఆఫీస్ కి వస్తుంటే దారిలో ఆక్సిడెంట్ అయింది. హాస్పిటల్ లో అడ్మిట్ చేసాం"అని. ఉరుకుల పరుగుల మీద హాస్పిటల్ కి చేరుకుంది. ప్రాణాలకు ప్రమాదమేమీ లేదు కానీ స్పైనల్ కార్డ్ దెబ్బతింది. ఇక మంచానికే పరిమితం అని చెప్పారు డాక్టర్లు. స్పృహలోకి వచ్చిన తర్వాత తన భర్త చెప్పిన మొదటి మాట "మా అమ్మా నాన్నలకు గానీ, మీ అమ్మానాన్నలకు గానీ తెలియచేయకు, వాళ్ళు బెంగపెట్టుకుంటారని". అప్పుడే అత్త గారి దగ్గర నుంచి ఫోన్ "మావ గారికి తీవ్రమైన గుండెపోటు వచ్చింది, తన భర్త ని సొంతూరుకి రమ్మనమని". కష్టాలన్నీ కట్టకట్టుకున్నట్లు ఒకేసారి వచ్చిపడేసరికి ఏం చెప్పాలో తెలియక "ఉద్యోగ పని మీద వెళ్ళారని వారం రోజులు వరకు రారని చెప్పింది". ఈ లోపులోనే మావగారు చనిపోవడం, ఆ పరిస్థితులలో తన భర్తకు, మావగారు చనిపోయారని చెప్పకపోవటమే

మంచిదని చెప్పలేదు. ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో భీమా సొమ్ము చేతికందటమే కాకుండా తన భర్త పనిచేసిన కంపెనీ సానుభూతితో మెడికల్ ఇన్ వాలిడేషన్ ఇచ్చి ఆ కంపెనీలోనే జాబ్ తన కివ్వడం జరిగింది. అప్పటినుంచి తన భర్తను కంటికి రెప్పలా చూసుకునేది. కాస్త పరిస్థితులు అనుకూలించిన తర్వాత భర్తకి, మావగారు చనిపోయిన విషయాన్ని చెపితే అర్థంచేసుకున్నా ఎంతైనా తన తండ్రి కదా, తండ్రి చనిపోయాడన్న బెంగ, తను మంచానికి పరిమితమైపోయాననే బెంగతో ముభావంగా ఉండి తన తల్లి తోనూ తక్కువగానే మాట్లాడేవారు కానీ తన తల్లి ఇబ్బంది పడకుండా ప్రతినెల డబ్బుని పంపమనేవారు. ఈ మధ్యనే కాస్త తన భర్త ఆరోగ్యం మెరుగయ్యింది. అటువంటి పరిస్థితులలో ఈ ఉత్తరం.

***  ***  ***  ***  ***

ఇహలోకంలోకి వచ్చింది. ఈ ఉత్తరాన్ని భర్తకు చూపించి అతనిని మరింత బాధపడేలా చేసేకంటే ఈ విషయాలను తన లోనే సమాధి చేసుకుని ఉత్తరాన్ని చింపేయాలని నిశ్చయించుకుంది. అత్తమామాలు తనని, తన భర్తని ఇహలోకంలో అపార్థం చేసుకున్నా పై లోకం నుండి తప్పనిసరిగా వారి ఆశీస్సులు తమ కుటుంబానికి ఉంటాయనే ఆశతో.

**********

**Telugu Association of North America (TANA)**
**in association with**
**Telugu Fine Arts Society (TFAS)**
**and Parsipanny Rotary Club**
organized
*** CPR Training Workshop***

**Date**:
February 29th 2020 at 1:30 PM
**Venue**:
33 Baldwin Rd, Parsipanny, NJ 07054


Heart Disease is the Leading Cause of Death in anywhere in the world. While heart disease is on the rise, CPR can help save lives. Sadly, 88% of people who suffer from a cardiac arrest outside of the hospital die. However, when properly and promptly performed, CPR can dramatically improve person's chance of survival. Anyone can learn CPR and everyone should.

This event was attended by over 50 people and they learned CPR technic. Sri. Raja Kasukurthi garu provided the training.



With Best Compliments from

## Dr. Mohan Patalolla & Family



---

With Best Compliments from

## Amara Family



# అప్పు చేసి పప్పు కూడు

## పాకల శ్రీనాథ్, టంగుటూరు

డబ్బు, ప్రేమ రెండు జీవితం లో ముఖ్య పాత్ర పోషిస్తాయి. రెండిట్లో ఏ ఒక్కటి సరిపడా లేకపోయినా రెండో దానికోసం జీవితమంతా పోరాడాలి.

"రాజీ ఈ నెల క్రెడిట్ కార్డు బిల్ ఇంత వచ్చిందేంటి" కొంచెం అసహనం గానే అడిగాడు రాజేష్. "చెప్పాను గా రాజేష్ నేను ఈ మంత్ షాపింగ్ చేశానని". "కానీ మరీ ఇంత నా...". "అంటే ఏంటి రాజేష్ నేను ఎక్కువ గా ఖర్చు పెడుతున్నానంటావా" గట్టిగానే అడిగింది రాజీ. "అంటే అలా కాదు రాజీ అన్నీ ఒకేసారి కాకుండా తక్కువగా కొనాల్సింది అంటున్నాను". "అయినా నా జీతం నా ఇష్టం ఇలా ప్రతిసారి మీకు నా ఖర్చుల గురించి సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు". అని గట్టిగా బదులిచ్చింది రజని.

రాజేష్, రజని లది ప్రేమ వివాహం. పెద్దల్ని ఎదిరించి మరీ వివాహం చేసుకున్నారు. ఇద్దరు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లే. నెలకు ఇద్దరు కలిసి దాదాపు గా లక్ష వరకు సంపాదిస్తున్నారు. రాజేష్ ది దాచి పెట్టే తత్త్వం, రజని ది ఖర్చు పెట్టే తత్త్వం. ఏమైనా భిన్న ధ్రువాలు ఆకర్షించుకుంటాయి కదా...!!!

ఇంతలో డాడీ అని పరిగెత్తుకుంటూ వచ్చాడు నాని — రాజేష్, రజని ల ముద్దుల కొడుకు. వాడిని చూడగానే ఉన్న టెన్షన్స్ అన్ని మర్చిపోయాడు రాజేష్. ఆ రోజు వాళ్ళ స్కూల్ లో జరిగిన విషయాలు మొత్తం చెప్తుంటే వింటూ ఉన్నాడు రాజేష్. "మీ కబుర్లు అయితే వెళ్లి తిందాం" అంది రజని. తన లో ఉన్న గొప్పదనము అదే, ఎంత గొడవ అయినా తనే వచ్చి మాట్లాడి వాతావరణాన్ని కూల్ చేస్తుంది.

"హలో రాజీ నేను కళ్యాణి ని". "హా చెప్పు ఏంటి విశేషాలు". "ఏం లేదు మేము కొత్తగా ఒక ఫ్లాట్ కొన్నాము గృహ ప్రవేశం వచ్చే ఆదివారం మీరు తప్పకుండా రావాలి". ఓ కంగ్రాట్స్ కళ్యాణీ, తప్పకుండా వస్తాము". అలా కాసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది రాజీ.

"రాజేష్, కళ్యాణి వాళ్ళు కొత్త ఫ్లాట్ కొన్నారంట తెలుసా" అని చెప్పింది రాజీ. అవునా అన్నట్లు తల ఊపాడు రాజేష్. "నేను ఎప్పటి నుండో చెప్తున్నా రాజేష్ మనం కూడా కొందామని నువ్వేమో ఇప్పుడు కాదు తరువాత చూద్దాం అని వాయిదా వేస్తూనే ఉన్నావు". "అసలు నేను చెప్పేది వింటున్నావా లేదా...నిన్నే" గట్టిగా అరిచింది రాజీ. "నేను చెప్పాను కదా మనకి కొంత టైం పడుతుంది కొంచెం ఓపిక పట్టు మనం చిన్నగా కొందాం" అన్నాడు రాజేష్. "నేను ఏం చెప్పినా నీకు పట్టదు రాజేష్ నేను చెప్పడం, అడగడం అనవసరం" . రాజేష్ తిరిగి సమాధానం చెప్పలేదు. తుఫాన్ వెలిసిన తరువాత ఉండే వాతావరణం లాగా ప్రశాంతం గా ఉంది ఇల్లు.

"అమ్మా ఆకలేస్తుంది" అంటూ రజని ని రెండు చేతులతో చుట్టేశాడు నాని. ఒక్క పది నిముషాలు నాని అంటూ లోపలికి వెళ్ళింది రజని. సరిగ్గా పదే పది నిమిషాల తర్వాత కాలింగ్ బెల్ మోగింది. రాజేష్ వెళ్లి ఓపెన్ చేసాడు. "సర్ ఇదిగో మీ ఆర్డర్ అని చేతిలో ప్యాకెట్ పెట్టి వెళ్ళాడు డెలివరీ బాయ్".

"రాజీ రాజీ...". "అబ్బా ఏంటి రాజేష్ అంతలా అరుస్తున్నావు". “మళ్ళీ ఆర్డర్ పెట్టావా..??". "పెడితేనే గా డెలివరీ చేసింది". "ఎందుకు రాజీ, ఇలా మనీ వేస్ట్ చేస్తావు". అన్నాడు రాజేష్. "ఏంటి నేను మనీ నీ వేస్ట్ చేస్తున్నానా ఏంటి రాజేష్ నువ్వు అనేది ఫుడ్ ఆర్డర్ చేయడం డబ్బులు వేస్ట్ చేసినట్లా అంటే తినడం కూడా తప్పంటావా..". "రాజీ నేను చెప్పేది అర్థం చేసుకో. అదే ఫుడ్ మనం ఇంట్లో నే చేసుకుంటే డబ్బులు సేవ్ అవుతాయి కదా". "రాజేష్ నువ్వే అర్థం చేసుకో నేను 30% ఆఫ్ తో ఆర్డర్ చేశాను. దీనికి కూడా నువ్వు ఇలా అడుగుతావనుకోలేదు రాజేష్". ఇంకా మాట్లాడితే గొడవ పెరుగుతుందే తప్ప తగ్గదని రాజేష్ ఏం మాట్లాడలేదు.

కొన్ని రోజుల తరువాత.......

"రాజీ ఏంటిది నీ నుండి ఈ నిర్ణయాన్ని ఊహించలేదు". "రాజేష్ ఇక నా వల్ల కాదు నేను ఇది బాగా ఆలోచించే తీసుకున్నాను ఈ నిర్ణయానికి నువ్వు కూడా సహకరిస్తే ఇద్దరికీ మంచిది". అని విడాకుల పేపర్స్ ని, పెన్ ని టేబుల్ మీద పెట్టింది రజని. "ఇప్పుడు విడాకులు తీసుకునేంత కారణం ఏముంది రాజీ" జీర బోయిన గొంతు తో అడిగాడు రాజేష్.

"నీకు తెలియదా రాజేష్ ఈ మధ్య నేను ఏం చేసినా నీకు నచ్చట్లేదు ప్రతి దానికి లెక్కలు, నా డబ్బు ని నేను ఖర్చు పెట్టుకున్నా నీకు సమాధానం చెప్పాల్సి వస్తుంది. నేను చిన్నప్పటి నుండి ఎవరికీ సమాధానం చెప్పలేదు ఇప్పుడు నువ్వు అడుగుతుంటే నువ్వు ప్రిన్సిపాల్ లాగా నేనేమో తప్పు చేసిన విద్యార్థి లాగా సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు".

"మరి నాని ఎలా రాజీ?"

"వాడిని నా దగ్గరే ఉంచుకుంటాను నీ దగ్గర ఉంచితే వాడు నీలాగే “పిసినారి' లాగా తయారవుతాడు". ఇక రాజేష్ ఏం మాట్లాడలేకపోయాడు. ఇప్పుడు ఏమి చెప్పినా వినే పరిస్థితిలో లేదు. ఇంకా మాట్లాడితే తను ఏమి అంటుందో అవి విని తను తట్టుకోగలతాడో లేదో అన్న భయం వేసింది రాజేష్ కి. "డబ్బు ముందు ప్రేమ ఓడిపోయింది".

విడాకులు వారం రోజులలో వచ్చేశాయి. ఈ రోజుల్లో ఇద్దర్ని కలపాలంటే ఎక్కువ సమయం పడుతుంది గానీ విడాకులతో విడదీయడానికి వారం రోజులు చాలా ఎక్కువ కదా. ఎంత కష్టపడి పెళ్లి చేసుకున్నారో అంతే సులువుగా విడిపోయారు. ఇవేమీ పట్టించుకోకుండా కాలం ముందుకు పోతూనే ఉంది. నాని బి. టెక్ కూడా పూర్తి చేసేశాడు.

"అమ్మా నేను మాస్టర్స్ చేయాలనుకుంటున్నాను". అని అన్నాడు నాని. "దానికి చాలా ఖర్చు అవుతుంది కదా రా". "అయితే ఏముందమ్మా ఇవ్వు". "అదేంటి రా ఇవ్వు అని అంత సింపుల్ గా చెప్తున్నావు. మన దగ్గర అంత డబ్బులు లేవు కదా". 'అవన్నీ నాకు తెలియదు. నేను వెళ్లాల్సిందే, నువ్వు పంపిచాల్సిందే" గట్టిగా చెప్పాడు నాని.

అప్పుడు గుర్తొచ్చింది రజని కి ఇన్నేళ్ళుగా తాను కూడబెట్టింది ఏమి లేదని. వచ్చిన జీతం అంతా నెల మొదటి పది రోజుల్లోనే అయిపోవడం మరో నెల కోసం ఎదురు చూడడమే తాను చేసింది. ఎంత ఎక్కువ జీతం వచ్చినా దానికి సరిపడా ఖర్చులు దాని వెంటనే వచ్చేవి అంతేగా 'పిండి కి తగ్గ రొట్టె', 'జీతం కొద్దీ ఖర్చులు'. జీతం రావడం ఏమో తాబేలు నడక లాగా, ఖర్చులేమో కుందేలు నడక లాగా ఉంటే ఎంత జీతం వచ్చినా సరిపోదు కదా'..!!

ఇప్పుడు ఏమి చేయాలో రజని కి అర్థం కావడం లేదు. నాని ఏమో తన మాట వినేటట్లు లేదు. బ్యాంకు లో లోన్ తీసుకుందామంటే మొన్ననే పర్సనల్ లోన్ తీసుకుని 'కార్' కొనింది. తన ఫ్రెండ్ కళ్యాణి ని అడుగుదామని తన దగ్గరకు వెళ్ళింది. కళ్యాణి ఇంతకు ముందు లాగా లేదు తన మోము లో ఇంతకు ముందు ఉన్న సంతోషము లేదు.

"రజనీ, మనం అలా బయటకి వెళ్లి మాట్లాడుకుందాం" అని రజని సమాధానం కోసం ఎదురు చూడకుండా తనని పక్క నున్న పార్క్ కి తీసుకెళ్లింది కళ్యాణి.

ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు రజని కి. కళ్యాణి కళ్ళ వెంట కన్నీళ్లు కారుతున్నాయి. "ఏయ్ ఏమైంది కళ్యాణి ఎందుకు ఏడుస్తున్నావు..?" అర్థం కాక అడిగింది రజని."మేము ఇంకో పది రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలి రజని". "అదేంటే మీరు ఏంతో ఇష్టపడి కొనుక్కున్న ఇల్లు కదా". "అంటే ఆ ఇల్లు తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నాము కానీ ఇప్పుడు కట్టలేకపోతున్నాము". "మీకు రెండు జీతాలు కదా ఎందుకు సరిపోవట్లేదే" అర్థం కాక అడిగింది రజని.

"ఎలా చెప్పను రజనీ నీకు, మా జీవితాలలో జీతం ఉంది గాని ప్లానింగ్ లేదు". "ప్రతిదానికీ లోన్... ఆ లోన్ తీర్చడానికి ఇంకో లోన్. ఇలా వచ్చే జీతం అలా లోన్ లు కట్టడానికే సరిపోవడం లేదు పైగా క్రెడిట్ కార్డు వల్ల ఏం కొంటున్నామో, ఎందుకు కొంటున్నామో తెలియకుండా ఏవేవో కొన్నాం ఇప్పుడు ఇలా జరిగింది". "అవును ఏదో పని ఉందన్నావు ఏంటి?" అడిగింది కళ్యాణి". "ఏమీ లేదు, నేను వస్తాను" అని ఇంటికి బయలుదేరింది రజని.

ఇప్పుడు అసలైన గతం కళ్ళ ముందు కదిలింది. తాను చేసిన ఖర్చులు, కొన్న వస్తువులు వాటిల్లో ఒక్కటి కూడ ఇప్పుడు తనకి ఉపయోగపడదు. ఈ ప్రపంచంలో తాను మాత్రమే ఉన్నట్లుగా నిరాశతో ఇంటివైపు అడుగులు వేసింది రజని.

తను తలుపు తెరుస్తూండగా గడియకు తగిలించిన పేపర్ కింద పడింది ఏమై ఉంటుందా అని ఓపెన్ చేసి చదవడం మొదలు పెట్టింది రజని.

"రాజీ నేను - సారీ రజనీ - నేను రాజేష్. నన్ను క్షమించు నేను నీకు ఒక మంచి భర్త ను కాలేకపోయాను. నేను ఏం చేసినా మన సంతోషం కోసమే చేశాను. కానీ ఆ మంచి చేయడం లో నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. నువ్వు చిన్నప్పుడు ఏంతో అల్లారు ముద్దు గా పెరిగి ఉంటావు. అలాంటిది నేను ఎంత బాగా చూసుకోవాలి? కానీ నేను అలా చేయలేదు. నా వల్ల నువ్వు ఎన్ని ఇబ్బందులు పడ్డావో కదూ.

రాజీ, నేను క్రెడిట్ కార్డు వద్దంది ఎందుకంటే - దాని వల్ల ఉపయోగం ఎంత ఉందో, అంతకన్నా ఎక్కువ నష్టం ఉందని. మనం ఎలా పడితే అలా వాడితే ఆ తరువాత ఆ క్రెడిట్ కార్డే మనలని వాడుతుంది. వచ్చిన జీతం లో ఎక్కువ మొత్తం ఆ క్రెడిట్ కార్డు బిల్ కే సరిపోతుంది. మనకి వడ్డీ లేని ఋణం ఇచ్చి అనవసరమైన వస్తువులను కొనిపించి నెలన్నర తరువాత ఆ బిల్ మీద తిరిగి వడ్డీ మనకే వేస్తాడు. వారెన్ బఫెట్ చెప్పింది అక్షర సత్యం రాజీ - మనకు అనవసరమైన వస్తువులను కొంటే, భవిషత్తులో మనకు అవసరమైన వస్తువులు అమ్ముకోవాల్సి వస్తుంది అని.

నువ్వు ఆ రోజు అన్నావు చూడు ఫుడ్ ఆర్డర్ చేసింది 30% ఆఫ్ కి అని అది చాలా సింపుల్ లాజిక్. అసలు వాడు 30% ఆఫ్ కి ఇస్తే వాడికి ఎంత లాస్ ఆలోచించు. వాడు ఫుడ్ కాస్ట్ ని ఎక్కువ చేసి దాని మీద 30% ఆఫ్ అని చేప్తే ఇంత చదువుకున్న మనం దాన్ని నమ్ముతున్నాము. మనం అందరం కలిసి కార్పొరేట్ వాళ్ళని బతికిస్తున్నాం రాజీ.

రాజీ! నాకు సొంత ఇల్లు కొనాలని ఆశ ఉంది. కానీ అది లోన్ తీసుకుని కట్టడం ఇష్టం లేదు. ప్రతి నెల EMI కడుతుంటే అది నా ఇల్లేనా అని అనిపిస్తుంది. కొన్నేళ్ళు వెయిట్ చేసి మన డబ్బులతో చిన్న ఇల్లు కట్టుకున్న ఆ ఆనందం, తృప్తి వేరు రాజీ. మనం తీసుకునే అప్పు కన్నా మనం వడ్డీ తో కలిపి 50% ఎక్కువ కట్టాలిసి వస్తుంది అదే మనం కొంచెం టైం తీసుకుని మన సేవింగ్స్ తో కట్టుకుంటే ఎంత డబ్బు ఆదా అవుతుందో ఆలోచించు.

అవసరం లేకపోయినా పిలిచి లోన్ ఇచ్చే బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు, ఆఫర్స్ చూపించే షాపింగ్ వెబ్ సైట్స్, ఈ రోజు క్రికెట్ మ్యాచ్ ఉంటే ఫుడ్ ఆర్డర్ ఇవ్వండి అని నోటిఫికెషన్స్ పంపే ఫుడ్ వెబ్ సైట్స్ ఇలా ఒకరేంటి అందరు అందని ద్రాక్ష పళ్ళ రుచి ని నేల మీద

నుండే చూపిస్తున్నారు. ఆలా సామాన్యుల శ్రమను కార్పొరేట్ వాళ్లే సొమ్ము చేసుకుంటున్నారు. ఆ ఊబి లో పడితే ఇక అంతే మన జీవితం మొత్తం వాటి చుట్టే తిరుగుంతుంది.

నేను ఇవన్నీ చెప్తుంది నువ్వు తప్పు చేశావని కాదు ఇలా చేస్తే మనం జీవితం లో దేనికకీ భయపడాల్సిన అవసరం రాదు. నన్ను అర్ధం చేసుకుని మనస్ఫూర్తి గా క్షమించు రాజీ! ఇవన్నీ నీకు అప్పుడే చెప్దామనుకున్నాను కానీ నువ్వు వినే పరిస్థితి లో లేవు. మనం కాలేజీ లో ఉన్నప్పుడు ఎప్పుడూ కలుసుకునే ప్లేస్ కి వస్తావని ఎదురుచూస్తూ..."

ఆ లెటర్ వెనుక ఒక కవర్ ఉంది అందులో 20 లక్షలకు డీడీ ఉంది నాని చదువు కోసం, రాజీ పేరుమీద కొన్న ఫ్లాట్ పేపర్స్ కూడా ఉన్నాయి. అవి చూసి రజనికి అప్రయత్నంగానే కళ్ళు తడి అయ్యాయి.

'ఏ బంధంలో నైనా మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరైతే మనం చేసిన తప్పుల్ని మర్చిపోయి వాటిల్లో మంచి ని వెతికి అండ గా నిలుస్తారో వాళ్ళే మనల్ని నిజంగా ప్రేమిస్తున్నట్టు...'

'సంజీవయ్య పార్క్ చెట్టు మీద ఇద్దరి మనుషుల కోసం జంట పావురాలు దాదాపు గా ఇరవై ఏళ్ల నుండి ఎదురు చూస్తూ ఉన్నాయి ఆ ఎదురు చూపులకు ఈ రోజు తెర పడాలని కోరుకుంటూ....' *******






Telugu Fine Arts Society partnered with Sai Datta Peetham to serve food to homeless people - Dec 2019



# జీవితం ఈజ్ ఈక్వల్ టు

రాంభక్త పద్మావతి

పచ్చని బంధాల మధ్య
కలుపుమొక్కలా
పచ్చనోటు మొలిచింది

పగలగొట్టలేనంత బలంగా
అహంకారపు గోడ కట్టి
ఎవరి కార్డులను వారి గుప్పెట్లో
జాగ్రత్తగా కప్పెట్టింది

అనుబంధాల పునాదుల మీద
పటిష్టంగా నిలబడాల్సిన ఇళ్ళన్నీ
పైసల గాలికి బీటలు వారుతున్నాయి

ఎవరి గుండెలలో వారు
కట్టుకున్న మందిరాలలో
రహస్యాలన్నీ పోగుపడి మేటలు
వేస్తున్నాయి

రక్తసంబంధాలూ ఏడడుగుల
బంధాలూ

"ధనం మూలం ఇదం జగత్"
మంత్రాన్ని
బాహాటంగానే వల్లె వేస్తున్నాయి
ఆస్తిపంపకాలు
అమ్మానాన్నల వాటాలు
అన్ని వాదనలూ ఎంత ప్రయాణించినా
డబ్బుజబ్బు తీరాన్నే చేరుతున్నాయి

ధనాశ కలరాలా
హెచ్చుతగ్గులు లేకుండా
అన్ని కాయాలనూ
సమానంగా కబళిస్తోంది

నెమ్మదిగా అల్లుకున్న
ఒంటరి సాలెగూళ్ళ దారాలు
అవసరానికి ఆదుకునే
ఆత్మబంధుత్వాలు కరువై
ఉరితాళ్ళై మెడకు బిగుస్తున్నాయి

అన్నదమ్ముల అక్కచెల్లెళ్ళ
గాఢస్నేహాల
ఆత్మీయతాగీతాలన్నిటిలోనూ
అపశృతులు జొరబడి
తేలికై గాల్లో తేలిపోతున్నాయి
పలురకాల ప్రేమలన్నీ
పలుచబడిపోయి
మురికికాలువలుగా
పొంగిపొరలుతున్నాయి

బ్రతుకంతా సమీకరణాలై పోయి
ఆఖరున కష్టించి
లెక్క తేల్చి చూస్తే
చివరికి

"జీవితం ఈజ్ ఈక్వల్ టు శూన్యం"
అనే తేలుతోందిప్పుడు

★★★ ★★★ ★★★

---


With Best Wishes from



Dr. Satyaveni Rao

&

Late Dr. Srinivasa K Rao

# ఆకు రాలిన చోట

## చొక్కర తాతారావు, విశాఖపట్టణం

ఆకాశాన్ని చీల్చుకొని అపార్ట్ మెంట్లు నగరాలుగా విస్తరించినప్పుడు
అపార్ట్ మెంట్లు పునాదులు కింద హరిత వనాలు ఉనికి కోల్పోతున్నాయి

భూమి నాలుగు చెరగులా విస్తరించిన పచ్చదనం
బీటలు వారి అగ్ని కీలలుగా మారి భూతాపం పెంచుతోంది

ఎక్కడో మూలన  బిక్కు బిక్కు మంటూ బతుకుతున్న చెట్టును చూస్తుంటే
ఆ చెట్టును కూడా బతక నిస్తారో లేదోనని వాన చినుకు దిగులు పడుతోంది

ఒకప్పుడు నేలతల్లి పచ్చని చీర కట్టి కనుచూపు మేర కాంతులు వెదజల్లేది
చుట్టూ చెట్టు పుట్టల పచ్చదనంతో పరిఢవిల్లేది
ఇప్పుడు చెట్టు లేదు పుట్ట లేదు ఎటు చూసినా ఎడారి దృశ్యాలే

మొక్కల్ని కాలికింద తొక్కేసి ప్లాస్టిక్ మొక్కలు నెత్తిన పెట్టుకున్నప్పుడే
మనిషి పచ్చదనానికి దూరమయ్యాడు

ఇవాళ మనిషి గుండె నిండా ఊపిరి పీల్చుకోలేకపోతున్నాడు
అడుగడుగున వాయుకాలుష్యం మనిషిని నిలువునా కమ్మేస్తోంది

మళ్లీ ఆకులు కదిలితేనే మనిషి గుండె చప్పుడు వినగలుగుతాడు
ఇప్పుడు రోడ్డుమీద నడవాల్సింది మనుషులు కాదు చెట్లు
చెట్లు సమూహాలుగా కదిలితే తప్ప మనిషికి మనుగడ ఉండదు
మట్టి చెట్టు మనిషిని విడదీసి చూడలేం

నువ్వు చెట్లను అదేపనిగా నరికేస్తున్నా
మట్టి పొరల్లో చెట్ల ఆనవాళ్లు ఇంకా భద్రంగానే ఉన్నాయి
ఎప్పటికైనా మనిషి మారక పోతాడా అని
నేలలో దాక్కున్న వేళ్లు ఆశతో ఎదురు చూస్తున్నాయి


చెట్లంటే సమాజపు పొలిమేర మీద వాయు కాలుష్యాన్ని తగ్గించే హరిత సైన్యం
పట్టణీకరణతో పల్లెలు ప్రకృతికి దూరమవుతున్నాయి

ఎండిన కొమ్మల మీద చివుళ్ళు అతికిద్దాం
మోడివారిన నేల మీద మళ్లీ పచ్చదనం నాటుదాం

ఎక్కడ చెట్టు పచ్చని వనంగా మారుతుందో అక్కడ మనిషి చిరునామా ఉంటుంది
ఎక్కడ కొమ్మ మీద కోయిల రాగం తీస్తుందో అక్కడ వసంతం విరిసినట్టే

ఆకు రాలిన చోటే కొమ్మ చిగురు తొడుగుతుంది
ఒక్కొక్కరు ఒక్కొక్క విత్తె విస్తరిస్తే తప్ప ప్రకృతిని మనం రక్షించుకోలేం
ఒక్కొక్కరు ఒక్కొక్క చెట్టై ఎదిగితే తప్ప మనలో వసంతం నింపుకోలేం

★★★★★★★★★


Travel Bag
5:26
Travel Bag
Mobile
Password
Forgot Password?
SIGN IN
Don't have account ? SIGNUP
Domestic or International Travellers Network Across 195 Countries
looking for travel companion for your parents coming from india?
Send or Receive Medicine, Documents, Phones, Laptop to your beloved ones In India or USA?
Traveling to India or USA and have some empty space in your suitecase to carry items?
App Store
Google Play
Don't worry Travel Bag App Is here to solve all your problems

# తొలగిన మబ్బులు

## పట్రాయుడు కాశీవిశ్వనాధం

ముకుందం, లక్ష్మీ భార్యాభర్తలు. ముకుందం ఒక ప్రేవేటు కంపెనీలో చిరుద్యోగి. మేమిద్దరం మాకిద్దరు అన్నట్లు చరణ్, శ్రీజ ఇద్దరు పిల్లలు. చరణ్ ఐదవ తరగతి, శ్రీజ రెండవ తరగతి చదువుతున్నారు.

లక్ష్మీ అనుకూలవతి, పొదుపరి కావడం తో తెచ్చిన కొద్ది పాటి సంపాదన తోనే చిన్న కుటుంబం చింత లేని కుటుంబం అన్న చందాన సాగిపోతోంది వారి జీవిత నౌక.

సముద్ర మన్నాక తుఫానులు జీవిత మన్నాక ఒడిదుడుకులు లేకుండా ఉంటాయా! సంసార సాగరంలో అడుగడుగునా సమస్యల సుడిగుండాలే... ముకుందం జీవితం లోను అమావాస్య చీకట్లు ముసురుకున్నాయి. సాఫీగా సాగుతున్న బతుకు బండి ఒక్కసారిగా కుదుపులకు లోనయ్యింది.

ఆరోగ్యంగా ఆడుతూ పాడుతూ తిరిగే చరణ్ ఒక రోజు జ్వరం తో మంచం పట్టాడు. ఎన్నాళ్లు మందులు వాడినా ఫలితం లేకపోయింది. రోజు రోజుకి కొడుకు ఆరోగ్యం క్షీణించడం తో పట్నం లోని కార్పొరేట్ హాస్పిటల్ కి తీసుకు వెళ్లారు ముకుందం దంపతులు. పరీక్షల అనంతరం డెంగ్యూ జ్వరమని తెలిసింది. ప్లేట్లెట్స్ క్రమేపీ క్షీణిస్తున్నందున, త్వరగా ప్లేట్లెట్స్ ఎక్కించాలని లేకుంటే ప్రాణాపాయమని, చెప్పారు వైద్యులు.. చూస్తూ కొడుకుని చంపుకోలేక బతికించుకోడానికి తగిన ఆర్ధిక స్థోమత లేక విలవిల్లాడిపోయారు ఆ దంపతులిద్దరు.

"ఇప్పటికే ఇంట్లో డబ్బులు, అప్పు చేసి తెచ్చిన డబ్బులు అయిపోయాయి. ఎక్కడైనా అప్పు పుడుతుందేమో ప్రయత్నించి చూస్తాను ఆపై భగవంతుని దయ" అని భార్యకి చెప్పి బయటకి వెళ్ళాడు ముకుందం.

కంటిని నెత్తురు చుక్క లేకుండా వచ్చిన భర్తని చూసి.. "ఏమండీ.. వెళ్లిన పని ఏమైంది?" అని ఆతృతగా అడిగింది లక్ష్మి. "ఇప్పటికే సహకరించవలసిన వాళ్ళు సహకరించారు. అయినా నా వంతు ప్రయత్నం చేసాను. ఎక్కడా అప్పు పుట్టలేదు" అన్నాడు పూడుకుపోయిన గొంతుతో ముకుందం.

"మీ ప్రయత్నం మీరు చేశారు. నా ప్రయత్నం నేను చేసాను. ఈ డబ్బులు కౌంటర్లో కట్టి తొందరగా ప్లేట్లెట్స్ ఎక్కించమని చెప్పండి." భర్త చేతిలో డబ్బులు పెట్టింది లక్ష్మి.

"ఈ డబ్బులు....."

"ఇప్పుడు అవన్నీ ఎందుకు పిల్లాడి ప్రాణాలు ముఖ్యం. తొందరగా వెళ్ళండి" అని భర్తని డాక్టరు దగ్గరికి పంపింది లక్ష్మి. తన ప్రమేయం లేకుండానే అడుగులు ఆ వైపు..

మనసులో ఆలోచనలు మాత్రం వేరొక వైపు.. నాకు సాధ్యం కానిది తనకెలా సాధ్యం అయ్యింది... ఆడది అడిగితే కాదని, లేదని అనే మగాళ్లు ఉంటారా.. తనని అభిమానించేవారు ఉన్నారేమో..

ఛ డబ్బుకోసం తప్పు పని చేయడానికి తన మనసెలా అంగీకరించింది...

ఇలాంటి మనిషితోనా ఇన్నాళ్లు నేను కాపురం చేస్తున్నది...అన్న మనసులోని ఆలోచనలతో కౌంటర్ లో డబ్బులు కట్టాడు ముకుందం.

ట్రీట్మెంట్ ప్రారంభించారు...

తొందరలోనే చరణ్ కోలుకున్నాడు. వారం తర్వాత డిశ్చార్జ్ చేశారు.

వారం రోజులుగా అనుమానపు వైరసుతో నిద్రపట్టలేదు ముకుందానికి. ఏ కల్మషము లేని లక్ష్మి హాయిగా నిద్ర పోయేది.

ఒకరోజు.. "శ్రీ వారికి ఏమిటో ఈ పరధ్యానం"...తల నిమురుతూ అడిగింది లక్ష్మి.

"ప్చ్ ఏముంటాయ్"మామూలే.

"మరెందుకలా!"

మనసులో మాట బయట పెట్టాలా వద్దా... సంకోచం..

"తాను చేసిన పనిని భర్త అంగీకరిస్తాడా".. లక్ష్మి మనసులో ఆందోళన..

"తప్పు చేసే ఉంటుంది, అందుకే భయపడుతోంది" భర్త మనసులో అనుమానం.

"చెప్పండి" ఆగి పోయారేం?

"అదే.. నీకు.... డబ్బులు..???

"ఓహ్ ఆదా! దాని గురించి బుర్ర పాడు చేసుకుని వారం రోజులుగా ముభావంగా ఉంటున్నారా. అదేదో ముందే అడిగి ఉంటే చెప్పేదాన్ని కదా!" అంది లక్ష్మి.

"చెప్పకూడనిదేమో అందుకే చెప్పలేదేమో అనుకున్నాను"

"భలే వారండీ ఇన్నాళ్ల మన దాంపత్య జీవితం లో ఇదేనా మీరు నన్ను అర్థం చేసుకున్నది. అపార్థాలే ఆలమగలకి అడ్డుగోడలు. అరమరికలు లేని ఆలమగలే ఆనందంగా జీవించగలరు. అంటూ చేతిలోని రికరింగ్ డిపాజిట్ పుస్తకాన్ని చేతిలో పెట్టింది."

పుస్తకాన్ని తెరచి చూసాడు...ఆర్. డి. మీద లోను తీసుకున్నట్లు వ్రాసి ఉంది. సందేహంగా ఆమె వైపు చూసాడు..

"మీరు ప్రతీ నెలా ఇంటి ఖర్చులకు ఇచ్చే మొత్తం నుంచి కొంత మొత్తాన్ని దాచి ఆర్. డి. కడుతున్నాను. ఇప్పుడు అవసరానికి దాని మీదే అప్పు తెచ్చాను. ఈ విషయాన్ని కాల పరిమితి పూర్తయ్యాక చెప్పి సర్ప్రైజ్ చేద్దామనుకున్నాను.. ఇంతలో ఈ ఆపద వచ్చి అప్పు తీసుకోవాల్సి

వచ్చింది. ఇదే మీ దగ్గర దాచిన విషయం.

ఇప్పటికనైనా వికసిస్తుందా శ్రీవారి మోము.. అని తన రెండు చేతులను భర్త భుజాలపై వేసి కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ.. అడిగింది.. లక్ష్మి

అంత వరకు బుర్రలో కాపురముంటున్న దెయ్యాలు పారి పోయాయి. మనస్సు తేటపడింది.

అర్ధానికి.. అపార్ధానికి తేడా ఒక అక్షరమే.. పచ్చని సంసారం లో చిచ్చు రేగడానికి కాపురాల్లో కలతలు పెరగడానికి ఆ ఒక్క అక్షరమే చాలదూ.....!

తోడ బుట్టిన వారినందరిని వదిలి వంశాభివృద్ధి కోసం, నా కుటుంబ బరువు బాధ్యతల కోసం, తన సుఖ సంతోషాలను సైతం త్యాగం చేసిన నా అర్ధాంగినా తప్పుగా అర్ధం చేసుకున్నది.... అని అనుకుంటూ తనని తానే నిందించు కుంటూ.. ఆమెని దగ్గరగా తీసుకుని వెచ్చని కన్నీళ్లు భుజం పై రాల్చాడు ముకుందం. *******

## మన ప్రేమ

బులుసు లక్ష్మణ్

ఈ నాటి ఊహలు ఒక నాటి గుస గుసలుగా మారి
ఈ నాటి మాటలు ఒక నాటి పాటలుగా మారి
ఈ నాటి చరణాలు ఒక నాటి చెలిమి రాగాలుగా
మారి
ఈ నాటి ప్రమాణాలు ఒక నాటి పురాణాలుగా మారి
ఈ నాటి మన ప్రేమ అరుదై ప్రేమికులకు బిరుదై
తేట తెలుగులా భావామృత కవితై
కలకాలం నిలిచి పోయే ప్రేమ పాఠశాలగా మారాలి

★★★★★★★★★★


REALTY MARK PLATINUM

LET US HELP YOUR DREAM COME TRUE

**1430 OAK TREE ROAD, STE-7**

**ISELIN, NJ 08830**

**OFFICE: 732-515-2997 CELL: 732-208-4389**

**ARE YOU THINKING OF BUYING OR SELLING YOUR BUSINESS, COMMERAL AND RESIDENTIAL IN NEW JERSEY AND PENSYLVANIA.**

**We give you our best service for all your REAL ESTATE/RESIDENTIAL/COMMERCIAL NEEDS**

PLEASE CONTACT **RAO** : 732-515-2997/ 732-208-4389

# నీ పిలుపే రాకపోతే ...

## శ్రీనివాస్ గూడూరు

నీ పిలుపే రాకపోతే...
నీ మాటే వినబడకపోతే...
ప్రకృతి,
మావి చిగురుకి వసంతం రానట్టుంది
వీణ తీగలకి వాణి రానట్టుంది.
వేణువు మూగవోయినట్టుంది
కొమ్మ మీదున్నా కోయిల,
కుహూ అంటూ కూయనట్టుంది..
బెంగగా దిక్కులు చూస్తున్నట్టుంది ..

నీ పిలుపే రాకపోతే...
నీ మాటే వినబడకపోతే...
ఆలోచన, అచ్చులు లేని భాషలా
గడబిడ గా ఉంది..
మనసు,
తుషారం లేని వేసవి ఉదయం లా
డ్రై గా ఉంది ..
ఆక్సీజెన్ దొరకని  శ్వాసకోశంలా
ఉక్కిరిబిక్కిరి అవుతోంది
గుండె, చప్పుడు చేయకుండా
నిశ్శబ్దంగా ఎదురుచూస్తోంది,

నీ పిలుపే రాకపోతే...
నీ మాటే వినబడకపోతే...
భావాలు,
గట్టు తెగిన ప్రవాహంలా
గమ్యం లేకుండా ప్రవహిస్తున్నాయి
గుండు చప్పుడు విన్న చెట్టు మీది పక్షుల్లా
చెల్లా చేదురై ఎగిరిపోతున్నాయి.
ఝుంఝూ మారుతానికి
కొట్టుకుపోతున్న మబ్బుల్లా
చెదిరిపోతున్నాయి

నీ పిలుపే రాకపోతే...
నీ మాటే వినబడకపోతే...
ఆరాటం,
ఏకాగ్రత నిలవటం లేదు,
ఏం చేయాలో తెలీట్లేదు
కాళ్ళు రెండూ,
ఒక చోట నిలవలేకున్నాయి
కళ్ళు, రెప్పలు వేయడం
ఎప్పుడో మరచిపోయాయి
హృదయం,
చినుకు కోసం నోళ్ళు తెరిచిన
బీళ్ళ పగుళ్ళ లా  పరితపిస్తోంది..

ఎదురు చూస్తున్నా,
ఆశ ఆవిరికాకముందే..
నీళ్ళు నిండిన కళ్ళల్లో
నీ రూపు ఎండమావి కాకముందే,
నీ పిలుపొస్తుందని,
కొన ఊపిరి ఆగకముందే!


With Best Wishes from,



**Dr. Janani Krishna**

**&**

**Dr. Krishna Kocherlakota**



# ఆగిన గుండె

ఓట్ర ప్రకాష్ రావు

గుండె నొప్పి ప్రారంభమైంది ......ఈ సారైనా చావు
వస్తుందా---,
ఛీ ఛీ ఈ గుండె నొప్పిని నమ్మకూడదు.
ఆరు నెలల క్రితం ఇలాగే గుండె నొప్పి వచ్చింది
తొందరపడి దూరాన ఉన్న పిల్లలను పిలిపించాను
నాముందు నిలబడ్డ పిల్లలను చూసాను
వారి మనసులో ఏముందో పసిగట్టాను
నా గుండె సక్రమంగా కొట్టుకోవడం చూసి కృత్రిమ
సంతోషం చూపిస్తున్నా
వారి మనసులో నిరుత్సాహాన్ని గుర్తించాను.

★★★ ★★★ ★★★

పిల్లలు దూరంలో ఉన్నారన్న ఆలోచనతో
ఒంటరిగా గడపవలసివచ్చిందన్న ఆవేదన.
ఒంటరితనాన్ని పిల్లలు అర్థం చేసుకొన్నారు కానీ
పరిష్కారం తెలిసినా చెప్పలేక పోయారు.
పెదవి విప్పి పిలిస్తే నేనెక్కడ వారింటికి వెళ్తానన్న భయంతో
మాటవరసకు కూడా నా పిల్లలు వారింటికి రమ్మని
చెప్పలేదు.

గుండెనెప్పి భరించలేక ఆత్మహత్య చేసుకొనేటంత
పిరికిదాన్ని కాదు
విముక్తి కలిగించే మరణాన్ని సహితం ఆహ్వానిస్తాను.

★★★ ★★★ ★★★

ఆటో వేగంతో పాటు నా గుండె వేగం పెరుగుతున్నట్లుంది,
పెరుగుతున్న నొప్పిని భరిస్తున్నాను,
ఆసుపత్రి లో ప్రవేశించడానికి ముందే గుండె ఆగితే
ఫరవాలేదు.
ఆసుపత్రిలో ప్రవేశిస్తే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో
వెళ్లడం... బ్రతికించడం
దూరంనుండి వచ్చిన పిల్లలలో కనపడే కృత్రిమ
సంతోషం... లోన నిరుత్సాహం....ప్చ్
గుండెనొప్పి సమయాన ఎవరైనా బాధ కలిగించేలా
మాట్లాడితే గుండె ఆగిపోతుందంటారు,
ఆటో దిగి నొప్పితో నడవలేక ఇబ్బంది పడుతుంటే
'మీరు అనాథలా' అంటూ ఒకామె ప్రశ్నించింది.
ఆమాటలు నా గుండెలో గునపంలా గుచ్చుకొంది---.
భరించలేని నొప్పి
ఇదే ఆఖరి క్షణం అనుకొంటూ ఒక్క సరిగా కింద
పడ్డాను!

★★★ ★★★ ★★★

---

# స్వప్న సుందరి

పట్రాయుడు కాశీవిశ్వనాధం,


ఆరుబయట వెన్నెల
నా పైన కురిసింది
ఒంటరిగా కునుకుతీస్తే
ఒల్లనని కసిరింది
మనోహరి ఎదుట మొరలిడమని
నను తరిమింది
జవరాలి వరం కోసం
విరజాజులిచ్చి పంపింది

లక్షల నక్షత్రపు అక్షరాలను
కోటిభావాల కనకాంబరాలను
రాశులుగా పోసి
మనసుదవనం
మధ్యన పెట్టి

కవితా సుమాల మాలనల్లి
పరిమళాల పిల్లగాలినై
నెచ్చెలి హృదయపు
వాకిలి తట్టాను

చేసుకున్న బాసలు
చెప్పుకున్న ఊసులు
మదినిండిన ఊహలతో
నా ప్రేయసి కలలసౌధంలో
కనువిందు చేసింది

**With Best Compliments from**




---

**With Best Wishes from**



## Rohini Kumar Vemula & Family

# మూడో కోరిక

## ఉప్పలూరి మధుపత్ర శైలజ

ఆ రోజు శాస్త్రిగారిల్లు బంధుమిత్రుల రాకతో కళకళలాడుతోంది. వారింట్లో పెళ్ళో మరేదైనా శుభకార్యమేమోనని చుట్టుప్రక్కల జనం చెప్పుకుంటున్నారు. కాఫీలు త్రాగుతూ హాల్లో బంధువులంతా కూర్చొని కబుర్లాడుకుంటున్నారు

అన్నయ్యా! ఉద్యోగాలరీత్యా ఎక్కడెక్కడో ఉన్న మనం ఇలా హాయిగా మాట్లాడుకున్న సందర్భాలు ఈమధ్యకాలంలో చాలా తక్కువ. ఏదైనా పెళ్ళిళ్ళకు వచ్చినా ఓ పూట హడావిడిగా వచ్చి వెళ్ళిపోతున్నామేగాని అసలు మనమంతా మనసారా కలసి గడిపిన సమయమే లేదు. నీ షష్టి పూర్తి వేడుకను మీ అబ్బాయిలు ఈ హైదరాబాద్‌లోని మీ సొంతింటిలో చేస్తున్నారు కనుక వాళ్ళు ప్లాన్ చేసిన ప్రకారం ఓ రోజు ముందుగా వచ్చాం. చిన్ననాటి ముచ్చట్లను, సంగతులను ఇంత ఆనందంగా పంచుకుంటున్నాం" అంది శాస్త్రిగారి చిన్న చెల్లెలు అనిత.

ఆ ఇంటికి పెద్ద దిక్కైన శాస్త్రిగారికి ఇద్దరు చెల్లెళ్ళు ఓ తమ్ముడు ఉన్నారు. పెద్ద చెల్లెలు రాధా వాళ్ళు బెంగళూరులోను, అనితా వాళ్ళు ఢిల్లీలోను ఉంటున్నారు. తమ్ముడు వారి సొంతవూరైన మచిలీపట్నంలో ఉంటాడు.

జీవిత భీమా సంస్థలో పనిచేసిన శాస్త్రిగారు తన చివరి మూడేళ్ళ సర్వీసును హైదరాబాద్‌లోనే చేయడం, గత నెలలో రిటైర్ కావడం జరిగింది. శాస్త్రిగారికి భార్య కమలమ్మ, ముగ్గురు కొడుకులు ఉన్నారు. పిల్లలందరి చదువు సంధ్యలు పూర్తయినాయి.

పెద్ద కొడుకు రవికి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం వచ్చిన తరువాత తెలిసిన వాళ్ళమ్మాయి వాణితో వివాహం చేశారు. రెండవ అబ్బాయి వాసు కూడా ముంబాయ్‌లోని ఓ ప్రయివేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. వాసుకు మాత్రం బయిటి సంబంధం, గీతతో పెళ్ళయింది. కోడళ్ళిద్దరు ఉద్యోగాలలో ఉన్నారు. పెద్దవాడికి ఓఅబ్బాయి, రెండవ వాడికి ఓ అమ్మాయి సంతానం.

ఇక శాస్త్రిగారి ఆఖరి కొడుకు మధు, ఈ మధ్యనే బి. డీ. ఎస్. పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.

రవి పూజ పూర్తిచేసి హాల్లో అత్తల దగ్గరకొచ్చేసరికి, వాకింగ్‌నుండి వచ్చిన వాసు ఫ్రెషయి వచ్చి వాళ్ళ దగ్గర కూర్చున్నాడు. అందరికీ ఫలహారాలనందించారు వాణి, గీతలు.

"మధు ఇంకా లేవలేదా?" అని అడిగింది రాధ.

"లేదత్తా! వాడు మనందరికంటే ముందుగానే లేచాడు. అయితే వాడు వాడి గది నుండి బయటకు రావటంలేదు" అన్నాడు వాసు.

"మేము దూరంగా ఎక్కడో ఒరిస్సా రాష్ట్రంలో ఓ మారు మూల ఉండటం, కాలేజిలో సీనియర్స్ చేసిన ర్యాగింగ్ వల్ల చదువు వత్తిడి తట్టుకోలేకపోయాడు వాడు. అసలే చిన్నప్పటి నుండి చాలా సెన్సిటివ్‌గా ఉండేవాడు. మొహమాటస్తుడు కావటంతో ఎవరికీ ఏమీ చెప్పకుండా మనసులోనే బాధపడుతూ ఈ స్థితికొచ్చాడు. మీ అన్నయ్య దగ్గరుండి ప్రస్తుతం వాడిని కౌన్సిలింగ్ చేస్తున్నారు. నిత్యం వాణ్ణి ఓ పసిపిల్లాడిని చూసినట్లుగా చూడాల్సి వస్తోంది" అన్నారు అప్పుడే అక్కడికొచ్చిన కమలమ్మగారు.

"ఈ కాలంలో కళాశాలలలో ర్యాగింగ్, ఆడపిల్లలపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు, వేధింపులు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. మరో ప్రక్కన పూజలు, హోమాలు, యాగాలు, టీ.వి. చానల్స్ లో పెద్దల ప్రవచనాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అందువల్ల యువత ధర్మ మార్గంలో నడవటానికి అవకాశాలున్నాయి. అయినా ఎన్నెన్ని నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయో మనం నిత్యం చూస్తూనే ఉన్నాం" అంటూ శాస్త్రిగారి తమ్ముడు తన ఆవేదననంతా మాటల రూపంలో బయట పెట్టాడు.

ఆ విధంగా మాటలతోనూ, మరుసటి రోజు ఏర్పాట్లతోను వారికి ఆ రోజు ఒక క్షణంలా గడిచిపోయింది.

షష్టి పూర్తి రోజు తెల్లవారుఝామునే వేడుకలు మొదలైనాయి. గణపతి హోమం, ఆయుషు హోమం, జల్లెడస్నానాలు మొదలైనవి పూర్తయిన తరువాత సత్యనారాయణస్వామివారి వ్రతం చేసుకున్నారు శాస్త్రిగారి దంపతులు. ఈలోగా బంధువులు, స్నేహితులు ఒక్కొక్కళ్ళుగా వచ్చి ఆ వేడుకలలో పాలుపంచుకున్నారు.

భోజనాలయ్యాక శాస్త్రిగారి తమ్ముడు, "అన్నయ్యా! సాయంత్రం మీకు అభినందన సభనేర్పాటు చేశాం, మీరు వదిన కాసేపు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు. పిల్లలతో కలసి ఆ సభ ఏర్పాట్లను చూడటానికి వెళ్ళాడు.

ఆ సాయంకాలం స్నాక్స్ పూర్తయ్యాక అంతా సమావేశమయ్యారు. ముందుగా పెద్ద చెల్లెలు రాధ మాట్లాడింది. తన పెళ్ళికి అన్నావదినలు ఎంతగా కష్టపడింది, అత్తగారింటిలో తను ఓ కూతురిలా అడ్జెస్టు కావటానికి వదిన ఎన్ని మంచి సలహాలనిచ్చిందో, తన పిల్లల బారసాలలు, అన్నప్రాసనలు వాళ్ళ చేతులమీదుగా ఎంత బాగా చేశారో, వారి ఆశీస్సులతో తన కాపురం మూడుపూలూ ఆరుకాయలుగా ఇప్పటి దాకా ఎంత చక్కగా సాగుతోందో ఒక్కొక్క సంఘటనను గుర్తుచేసుకొంటూ చెప్పి అన్నావదినలకు నమస్కరించి కూర్చుంది.

రాధ తరువాత శాస్త్రిగారి తమ్ముడు మాట్లాడుతూ, "తన చదువు కోసం అన్నయ్య ఎంత తపన పడింది వివరిస్తూ చదువుకోకుండా స్నేహితులతో సినిమాలకనీ, షికార్లకనీ తిరుగుతూంటే చదువుకొనే కాలమెంత విలువైందో ఆ తరువాత చింతించి ప్రయోజనం లేదంటూ తన దగ్గరే ఉంచుకొని ఎలా చదివించింది" చెప్పాడు. "తాను ఇంతటి ఉన్నత పొజిషన్‌కు రావటానికి అన్నయ్య ఇచ్చిన నైతిక, ఆర్థిక మద్దతు అంతా ఇంతా కాదు" అంటూ అన్నావదినలకు భార్యతో కలసి పాదాభివందనం చేశాడు.

చిన్న చెల్లెలు అనిత "నేను కాలేజి చదువు చివర్లో ఉండగా అన్నా వాళ్ళకు రవి పుట్టాడు. నా పెళ్ళికి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు, వదిన తన నగలను బ్యాంకులో పెట్టి కొంత డబ్బు, రవి చదువు కోసం దాచిన డబ్బును వాడిన సందర్భాన్ని గుర్తుచేసుకొంది. నా పెళ్ళి ఉన్నంతలో బాగా చేసి నన్ను ఒక మంచి కుటుంబంలోకి పంపించారు. అమ్మా నాన్నలు నన్ను కన్నారేగానీ, నాకు అయితే వీళ్ళే అమ్మా నాన్నలు" అంటూ ఉద్వేగంగా మాట్లాడింది.

బంధుమిత్రులంతా శాస్త్రిగారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ వారి వల్ల తాము ఏమి నేర్చుకొన్నది, వారి సలహాలు, సూచనలు తమకు ఎంతగా ఉపయోగపడ్డాయో వివరించి చెప్పారు.

శాస్త్రిగారి పెద్దబ్బాయి రవి, "నాన్నగారు బాధ్యతల కావిడిని తాను మోస్తూ మమ్మల్ని బంగారుపల్లకీలో ఊరేగించారు. చదువుల ప్రాముఖ్యాన్ని గుర్తించమంటూ మాకు మంచి చదువులను చెప్పించారు. నాన్నగారికి నేను 10వ తరగతికి వచ్చేవరకు ఒక సైకిలు ఉండేది. ఆ తరువాత స్కూటర్ కొనుక్కున్నారు. వారు పెద్ద హోదాలో రిటైరైనా వారు కారు కొనలేదు. అంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. నేను ఉద్యోగంలో చేరిన మూడు సంవత్సరాలకే కారు కొన్నాను. మొదటిసారి నా కారులో ఎక్కి, డ్రైవింగ్ చేస్తున్న నన్ను తదేకంగా చూస్తూ, ఘంటసాల వారి పాటలువింటూ మైమరచిపోతున్న నాన్న కళ్ళలో కనిపించిన ఆ ఆనందాన్ని నా గుండెలలో పదిలంగా దాచుకొన్నాను. అది నాకు ఎన్నటికీ మరచిపోలేని మధురానుభూతి. ఇలాంటి సంఘటనలు నా జీవితంలో చాలా ఉన్నాయి. అన్నింటిని చెప్పాలంటే సమయం చాలదు" అంటూ ముగించాడు.

"నాన్నగారు మాకొక రోల్ మోడల్. మా మెంటర్. మాకు చదువు, కెరీర్, అనుబంధాలు తప్ప ఈ బాధ్యత మీది అనిగాని, ఈ అప్పు మీరేతీర్చండి అనిగాని చెప్పలేదు. అసలు మాకు సమస్యన్నదే తెలియనీయలేదు. ఇప్పటివరకు నాన్నగారు తన ఉద్యోగ బాధ్యతలతో ముంబాయ్ లోని మా ఇంటికి ఇప్పటివరకు రానేలేదు. ఇకనైనా వారు మాతో ఉంటే వారి సలహాలను ఆనందాలను చూస్తూ మేము స్ఫూర్తి పొందుతాం" అంటూ రెండో అబ్బాయి వాసు చెప్పాడు.

"నేను అమ్మానాన్నలను చాలా మిస్ అయ్యాను. నాకు కాలేజిలో సమస్యలు వచ్చినప్పుడు చెప్పుకోవటానికి వాళ్ళు దూరంగా ఉన్నారు. అన్నలతో పోలిస్తే నా చదువుకు ఎంతో ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి నన్ను మెడిసిన్ చదివిస్తున్నారు. ఇంకా నా బాధలను చెప్పి వారికి ఒక సమస్య కాకూడదనుకున్నాను. అందుకే వాళ్ళు ఫోన్‌చేస్తే బాగానే ఉన్నానని చెప్పేవాణ్ణి. కాలేజిలో చదువంతా అస్తవ్యస్తంగా మారింది. ర్యాగింగ్ అంటూ నాసీనియర్స్ నాపై చేసిన దాడులు అంతా ఇంతా కాదు. విలువైన నా పుస్తకాలను దాచేసి కాలేజిలో ఎక్కడో పెట్టాం వెత్తుక్కోమనేవారు. ప్రిన్సిపాల్‌కు చెపుతానంటే "నిన్ను ఇక కాలేజికి రాకుండా చేస్తామంటూ బెదిరించేవారు. ఏమి చెయ్యాలో అర్థమయ్యేది కాదు. ధైర్యం చేసి పైవాళ్ళకు రిపోర్ట్ చేసినా, వాళ్ళు ఇదంతా మామూలే, మీ ఇంట్లో నీకు అన్నలుంటే నిన్ను ఆట పట్టించకుండా ఉంటారా? సర్దుకుపోతే గొడవలుండవు కదా అని నాకే నచ్చ చెప్పి పంపించే వారు. సిగరెట్లు కాల్చమంటూ, మందు తాగమంటూ, వాళ్ళు చేసిన వత్తిడికి నాకు కాలేజికి వెళ్ళాలంటేనే భయం వేసేది" అంటూ దుఃఖం రాగా చెప్పటం ఆపేశాడు మధు.

"కాసేపటి తరువాత, ఓ సంవత్సరం ఖాళీగా ఉండి, అమ్మా నాన్నల సాయంతో కాస్త తేరుకున్నాను. అదృష్టవశాత్తు నా మెడిసిన్ పూర్తయ్యింది. నాకింకా జాబ్ రాలేదు. నాన్నగారికి నాబాధ్యత ఇంకా మిగిలింది. నేను సంపాదించి పెట్టాల్సిన వాణ్ణి, ఇప్పుడు వారు రిటైరయ్యాక కూడా వారికి భారంగా ఉండాల్సి వస్తోంది. అన్నలలాగా..." బాధతో, దుఃఖం పొంగుకురాగా మాట పెగలక తన రూం లోకి వెళ్ళిపోయాడు మధు. బాబాయి అతని వెనుకనే వెళ్ళి ధైర్యం చెపుతూ కూర్చున్నాడు.

"వదినా! నీ సహాయం, సహకారం లేనిదే అన్నయ్య ఇవన్ని సాధించేవాడు కాదు. నీ మాటల్లో నీకేమైనా ఆశలు, ఆశయాలూ ఉన్నాయా? ఏమైనా ఉంటే అన్నయ్య ముందు చెప్పు" అని అనిత అంది.

కమలమ్మగారు, "మీ అన్నయ్య తన వైపు వారినే కాదు, నా వైపు వారిని కూడా తరతమ భేధం లేకుండా చూశారు. చూస్తున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ మా అమ్మను తెచ్చి తన కన్నతల్లిలాగా చూస్తున్నారు. నాకు మంచి భర్త, మాణిక్యాలవంటి పిల్లలు దొరికారు. అంతా బాగానే ఉంది. మధు కూడా ఓ ఉద్యోగంలో చేరితే, వేరే ఏ ఆశలు నాకు లేవు. అందరికీ దీవెనలు" అంటూ క్లుప్తంగా ముగించారు.

మధు రూం నుండి తిరిగి సభలోకి వచ్చిన శాస్త్రిగారి తమ్ముడు, "అన్నయ్యా! ఇక నీ వంతు. ఇంత కష్టపడి మమ్మల్ని కూడా నీ కన్నబిడ్డలలాగానే పోషించావు. అయితే నీకు కూడా కొన్ని కోరికలుండవచ్చును కదా? నీ మనస్సులో ఉన్న కోరికలేమిటో మాతో చెప్పు. ఇప్పుడు నీకు చాలా సమయం, రిటైరయ్యాక వచ్చే డబ్బుండి ఉంటుంది. ఏమైనా వ్యాపకం పెట్టుకుంటావా? నీ జీవితయానంలో నీకు

తీరని ప్రత్యేకమైన కోరికలుంటే ఇప్పుడు తీర్చుకుంటావా?" అంటూ అన్నయ్యను అడిగాడు,

తమ్ముడడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ శాస్త్రిగారు, "నాకు ముందు నుండి ఇద్దరి చెల్లెళ్ళకు మంచి పెళ్ళి సంబంధాలను తేవాలని, తమ్ముడు బాగా చదివి, మంచి ఉద్యోగంలో చేరాలని, చివరిగా నా కొడుకులు కూడా మంచి చదువులతో సమాజంలో మంచి స్థానంలో ఉండాలనేవి ప్రధానమైన కోరికలు. భగవత్ కృపవల్ల అవి అన్నీ కూడా తీరిపోయాయి".

"ఇక పూర్తిగా నా వ్యక్తిగతమైన కోరికలంటూ ఏమీ లేవుగాని, నాకు చిన్నపటి నుండి క్రికెట్ ఆటంటే చాలా ఇష్టం. రేడియో కూడా కొనలేని పరిస్థితులలో ఉన్న మాకు, నాకు ఉద్యోగం వచ్చిన తరువాతగాని రేడియోలో క్రికెట్ కామెంట్రీ వినడం జరగలేదు. టీ. వీ లు అందుబాటులోకి వచ్చాక నేను దానిని కొనటానికి చాలా సమయమే పట్టింది. ఒనీడా కలర్ టీ. వీ నేను కొన్న తరువాత మొదటిసారిగా ఇండియా-ఆస్ట్రేలియా మ్యాచ్‌లను తెల్లవారుఝామునే లేచి చేతిలో కాఫీకప్‌తో ఆనందంగా చూసేవాణ్ణి. కొందరు మిత్రులు హైదరాబాద్, వైజాగ్, బెంగళూర్లలో జరిగిన క్రికెట్ ఆటను స్టేడియంలో కూర్చుని చూసొచ్చాం అని ఉత్సాహంగా చెపుతూంటే నాకా భాగ్యం ఎప్పటికో అనిపించేది"

"మన దేశంలోని అందమైన ప్రదేశాలను చూడాలని, తీర్థయాత్రలు చేయాలని ఉత్సాహంగా ఉండేది. కానీ అలా యాత్రలు చేయటానికి సరిపడినంతగా డబ్బు ఉండేది కాదు. ముఖ్యంగా కాశీ, రామేశ్వరం చూడాలని అనుకునే వాణ్ణి". ఇప్పుడంతా తీరుబడే కదా తప్పకుండా చూస్తాం.

ఓ సారి పేపర్‌లో "తక్కువ సమయంలో సింగపూర్ సాధించిన అభివృద్ధి" అనే అంశం చదవటం జరిగింది. "ఆదేశ ప్రధానమంత్రి ప్రజలతో మమేకమై, వారి భాగస్వామ్యంతో పలు పథకాలను అమలు పరచినతీరు, ఉచితాలు, రద్దులు లేకుండా ప్రజలకష్టాన్ని పెట్టుబడిగా పెట్టి ప్రజలందరికి స్వంత ఇళ్ళు సమకూర్చటంతో వారి మనసులను గెలుచుకోవటం, అదే కారణంగా ఇన్నేళ్ళనుండి ఆ దేశానికి ఒకేవ్యక్తి ప్రధానమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావటం, ఆయన అవినీతికి, బంధుప్రీతికి ఆమడదూరంలో ఉండి ప్రజలను ఆత్మబంధువులుగా మార్చుకొని దేశాభివృద్ధికి వారి సేవలను వాడుకుంటున్న విధానం, ఆదేశ ప్రగతికి కారణాలుగా వ్రాసారు. అందుకే ఆరోజునే ఒక్కసారన్నా సింగపూర్ వెళ్ళిరావాలనిపించింది".

ఆదేశ అభివృద్ధిని సామాన్యుడనైన నేను కళ్ళారా చూచి ఓ నోట్ వ్రాసి మన ప్రభుత్వానికి పంపాలని, అంతదాకా నాకు ఆ భగవంతుడు ఆయుష్షు ఇవ్వాలని మన దేశ అభివృద్ధికి తపనపడేవారికి ఆ నోట్ ఉపయుక్తం కావాలన్నది నా కోరిక.

ఓపిక, ఉత్సాహం, పట్టుదలలుంటే, ఏపనైనా సాధ్యమేనని నేను నమ్ముతాను. నా సెకండ్ ఇన్నింగ్స్‌ను మంచిపనులు చేయటానికి వాడుకొంటాను. ఇష్టమైన పనులను చేస్తూంటే లైఫ్ స్పాన్ పెరుగుతుందనేది మీ అందరికి తెలిసిన విషయమే కదా. ఇక నా మూడో కోరిక..." అని ఆపేశారు శాస్త్రిగారు.

"చెప్పండి అన్నయ్యా, మీ మూడో కోరిక ఏమిటొ మమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టకండి" అన్నాడు శాస్త్రిగారి తమ్ముడు.

"ఆ కోరిక ఏమిటో సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెపుతాను. అప్పుడు మీ అందరికీ ఫోన్ చేస్తాను. ఇలాగే మీరంతా తప్పకుండా రావాలి. తొందరలోనే ఆ రోజు రావాలనీ ఆశిస్తూ, మీ అందరు ఇంత శ్రమ తీసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందులకు ఆశీస్సులను అందజేస్తున్నాను" అంటూ శాస్త్రిగారు తన మాటలను ముగించారు.

"పిల్లలూ, నాన్నగారి ఆశయాలు, ఆయన వ్యక్తిగత కోరికలను విన్నారుకదా. మరి వాటిని తీర్చటానికి మీ ప్రయత్నాలను మొదలుపెట్టండి. ఒరే రవీ! నీవు ఉద్యోగరీత్యా ప్రస్తుతానికి వైజాగ్ వదిలిరాలేవు కనుక, నాన్నగారికి క్రికెట్ మ్యాచ్‌ని చూపించే బాధ్యతను నీవు తీసుకుంటే బాగుంటుంది. అలాగే నాన్నగారికున్న సింగపూర్ చూడాలనే కోరికను తీర్చే బాధ్యతను వాసు తీసుకుంటాడు" అన్నాడు శాస్త్రిగారి తమ్ముడు.

రవికి పుస్తక పఠనమంటే బాగా ఇష్టం. క్రికెట్ మ్యాచ్ వస్తూంటే టి. వీ. ఛానల్స్ మార్చేసేవాడు. శాస్త్రిగారు చూస్తున్నప్పుడు మాత్రం ఛానల్స్ మార్చలేక గుడికెళ్ళటమో, లైబ్రరీకెళ్ళటమో చేసేవాడు. అందుకే రవి ఏమంటాడోనని, "రవీ! మొదటి ఛాన్స్ నీకే వచ్చింది" అంటూ మేనత్తలు అతన్ని ఆట పట్టించారు.

అలాగే ప్రోజెక్ట్ పనులు వచ్చి కంపెనీ తరుపున చాలాసార్లు అమెరికాకు, ఆస్ట్రేలియాకు వెళ్ళే ఛాన్స్ వచ్చినా, నాకు విదేశాలంటే మోజులేదు, నా మాతృభూమి భారతదేశాన్ని వదలి ఎక్కడకూవెళ్ళననే వాసు, చిన్నప్పుడు రామక్రిష్ణామిషన్ కెళ్ళి ఆ పరమహంస రామక్రిష్ణుని, వివేకానందుని పుస్తకాలను, బోధనలను చదివి ఆ సూక్తులను తన రూం గోడలనిండా వ్రేలాడతీసుకున్న వాసుని కూడా మరి "ఇప్పుడు సింగపూర్ పరిస్థితి ఏమిట్రా?" అంటూ అతనిపై ఛలోక్తులను విసిరారు.

పెద్దవాడు, "నాన్నగారు నేను చదువుకొనేటప్పుడు ఏదడిగినా కొనిపెట్టేవారు. నచ్చిన చదువును చెప్పించారు. వారి ఈ చిన్న కోరికను నేను తీర్చలేనా? తప్పకుండా వారి కోరికను త్వరలోనే తీరుస్తాను. త్వరలో బెంగళూర్ లో జరిగే ఆస్ట్రేలియా-ఇండియా మ్యాచ్‌ను నాన్నకు చూపిస్తాను" అన్నాడు.

"అన్నయ్యకిష్టంలేని క్రికెట్ మ్యాచ్ చూపించటానికి వాడు

తయారు అయ్యాడు కదా! అలాగే నేనూ నా మనసును సిద్ధం చేసుకుంటాను. ఇక్కడ నాన్నగారి కోరిక ప్రధానమేగానీ మా ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యతనివ్వకూడదు. మా కంపెనీ ప్రోజెక్ట్స్ సింగపూర్‌లో కూడా ఉన్నాయి. వెంటనే నేనే అప్లికేషన్ పెడతాను. ఆ ప్రోజెక్ట్ వస్తే అమ్మా నాన్నలను వెంటబెట్టుకొని అన్నీ చూపిస్తాను. అక్కడే ఉండిపోవాలని నాన్నగారు అనుకోవటంలేదు నాకు కూడా ఆ ఉద్దేశ్యం లేదు. అక్కడున్న తెలుగు సంస్థల ద్వారా, చికాగోలో ప్రసంగించిన వివేకానందునివలె భరతజాతి గొప్పతనాన్ని వినిపించి వస్తాను" అన్నాడు వాసు.

"నాన్నగారితో పాటుగా ఇక్కడే ఉంటాను కాబట్టి, ఆయన మూడో కోరిక ఏమిటో తెలుసుకొని వారు ఏది చెప్పినా నేను తీరుస్తాను. నా చదువుకు తగ్గ జాబ్ రాకపోయినా, వేరే ఏదైనా ఉద్యోగంలో వెంటనే చేరతాను. వారికి చేతికర్రలా ఆసరాగా ఉంటాను" అన్నాడు తిరిగి సభలోకి వచ్చిన మధు.

"మీరంతా బలవంతపెట్టటంవల్ల నా కోరికలంటూ చెప్పానుకానీ పిల్లల్ని ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యమేమి నాకు లేదు. నా ప్లాన్స్ నాకున్నాయి" అన్నారు శాస్త్రిగారు.

"నాన్నగారు, ఇన్నాళ్ళకు మీకు సేవచేసే చిన్న అవకాశాన్ని మాకు ఇచ్చారు, దానిని సక్రమంగా నెరవేర్చేలా దీవించండి" అంటూ ముగ్గురు కొడుకులు తండ్రికి నమస్కరించి, ఆలింగనం చేసుకున్నారు.

ఆ దృశ్యాన్ని చూసిని అందరి కళ్ళు చెమర్చాయి. "కంటే ఇలాంటి కొడుకులనే కనాలి" అనుకున్నారు.

"నీ పిల్లలు ఎంత బుద్ధిమంతులన్నయ్యా, తండ్రి కోరికను తీర్చటానికి ఏమాత్రం వెనుకాడని ఇలాంటి పిల్లలున్నందులకు నీ జన్మ సార్థకమైందిరా" అన్నారు శాస్త్రిగారి చెల్లెళ్ళు.

మరుసటి రోజు ఎవరి ఊళ్ళకు వారు వెళ్ళిపోయారు. ఇల్లంతా బోసి పోయింది.

కాలచక్రం గిర్రున తిరిగి, అప్పుడే శాస్త్రిగారు రిటైరయి రెండేళ్ళు గడిచిపోయాయి. ఆ రోజు శాస్త్రిగారి మిత్రులు కొందరు ఆయనను చూడటానికి వచ్చారు. కమలమ్మగారు వచ్చిన వారినందరిని కూర్చోపెట్టి శాస్త్రిగారిని పిలవడానికి లోపలకెళ్ళారు.

"ఓ! సుగుణాకర్, ప్రసాద్ ఎలా ఉన్నారు మిమ్మల్నందరిని చూసి చాలారోజులయ్యింది" అంటూ ముఖం విప్పారగా స్నేహితులను పలకరిస్తూ శాస్త్రిగారు వచ్చి వాళ్ళ ప్రక్కన కూర్చున్నారు.

"మేమంతా బాగానే ఉన్నామండి శాస్త్రి గారు! మీరెలా ఉన్నారు? ఈ ఇంటి గృహప్రవేశానికి వచ్చాం కదా, అందువల్ల మీ ఇల్లు గుర్తుండిపోయింది. మీరున్నారో లేదో అనుకుంటూ, కింద వాచ్ మెన్ నడిగితే ఉన్నారని చెప్పాడు. మా అదృష్టం కొద్ది మీరు ఏ వైజాగో, ముంబాయో లేదా ఏ యాత్రలకో వెళ్ళకుండా ఇక్కడే ఉన్నందులకు, మిమ్మల్ని ఇలా కలసినందులకు చాలా సంతోషంగా ఉంది. మీ విశ్రాంత జీవితం ఎలా గడుస్తోందో చెప్పండి?" అన్నారు.

"రిటైరయిన ఆరునెలలకు, ఓరోజు, మా పెద్దబ్బాయి నన్ను బెంగళూర్ తీసుకెళ్ళి చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూపించాడు. జీవితంలో అలా మ్యాచ్ చూడటం మొదటిసారి" అంటున్న శాస్త్రిగారి మాటలకు అడ్డువచ్చారు కమలమ్మగారు.

"అయ్యిందా ముచ్చట? ఈ క్రికెట్ పిచ్చి రిటైరైనా తగ్గలేదు. ఓ సినిమాగాని, సీరియల్ గాని చూడనివ్వరు. పొద్దస్తమానం క్రికెట్ మ్యాచ్‌లను లైవ్‌లోనో, పాతమ్యాచ్‌లనో చూస్తూంటారు ఈయన" టీలనందిస్తూ వాళ్ళకి ఫిర్యాదు చేసారు కమలమ్మగారు.

"సార్! మీరు మీ కలను తీర్చుకున్నారే! చూస్తే క్రికెట్ మ్యాచ్ స్టేడియం లోనే చూడాలి అన్నమాటను మీ నోటి వెంట ఎన్నో సార్లు విన్నాం. ఉద్యోగంలో ఉన్నప్పుడు, డబ్బులుండాలి, మ్యాచ్ ఉన్న సమయంలో సెలవు దొరకాలి, ఇలా ఎన్నో అడ్డంకులు. మ్యాచ్‌ను బాగా ఎంజాయ్ చేసుంటారు" అని అన్నారు మిత్రులు.

"ఆ జనాల మధ్యన ఈయనగారు కూడా చిన్నపిల్లాడిలా అరుపులు కేకలూ వేశారని మా అబ్బాయి చెపుతూంటే, 'వృద్ధులది చిన్నపిల్లల స్వభావమే' అని ఎందుకంటారో నాకర్థమయ్యింది. ఇవిగో మీ శాస్త్రిగారి క్రికెట్ సంబరాలు ఇక్కడే ఉన్నాయి" అంటూ కొన్ని ఫోటోలనందించారు కమలమ్మ గారు.

జీన్స్‌ప్యాంట్, ఇండియా అని రాసివున్న టీషర్ట్, తలపై హ్యాట్, చేతిలో 'Limca' సీసాతో కనిపిస్తున్న శాస్త్రిగారిని చూసిన సుగుణాకర్, "మీ వయస్సు అసలు కనిపించటం లేదండీ, మేడం అన్నట్లుగా చిన్నపిల్లడిలాగానే ఉన్నారు మీరు" అన్నారు.

"ఏమైనా శాస్త్రిగారు జల్సారాయుడై పోయారే రిటైరైనాక" అంటున్న మిత్రుల మనస్సులో కొంత ఈర్ష తొంగిచూసిన మాట వాస్తవం.

"అవే ఏమి చూశారు! ఇవి చూడండి" అంటూ సింగపూర్ లో తీయించుకొన్న ఫోటోలనందించారు కమలమ్మగారు.

పెద్ద పెద్ద బిల్డింగ్స్‌వద్ద వాసుతో పాటునుంచున్న శాస్త్రిగారి ఫోటొను చూపిస్తూ "సార్! ఇవేమైనా ఆఫీసులా?" అని అడిగాడు ప్రసాద్.

"అక్కడి ప్రభుత్వం, ప్రజల ఉమ్మడి సహకారంతో నిర్మాణమైన పేదలఇళ్ళవి. దేశార్థికాభివృద్ధిలో ప్రజలంతా పాలుపంచుకుంటారు. సోమరితనం అన్నది అక్కడ కనిపించదు. ప్రజలకు నివాసం, వైద్యం, విద్య మొదలైన అన్ని విషయాలను ప్రభుత్వమే చూసుకుంటుంది. అందువల్ల ప్రజలంతా నిశ్చింతగా నిస్వార్థంగా పనిచేయడానికి అలవాటు

పడ్డారు.

అందువల్లనే దశాబ్దాలనుండి ఏకైక పార్టీ పరిపాలిస్తున్న సిసలైన ప్రజాస్వామ్య దేశంగా స్ఫూర్తిని కలిగిస్తోంది. మిగిలిన ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా నిలచింది. మన దేశంతో పోల్చుకుంటే ఎంతో చిన్నదైనా, అభివృద్ధిలో మనకందనంత ఎత్తులో ఉన్నదా దేశం.

నేను కేవలం వినోదం కోసమో, ఆదేశాభివృద్ధిని చూడటానికి మాత్రమే సింగపూర్ వెళ్ళానని మీరనుకోవద్దు. ఆ యాత్రను నేను విజ్ఞాన యాత్రగా మలచుకున్నాను. త్వరలో తగిన సలహాలు, సూచనలతో ఆదేశాభివృద్ధిపై ఒక వ్యాసం వ్రాసి, మన ప్రభుత్వానికి పంపుతాను. మా మధు ఆపనిలోనే ఉన్నాడు" అంటున్న శాస్త్రిగారి కళ్ళలో వారు సింగపూర్ యాత్రలో పొందిన ఉద్వేగమంతా కనిపించింది.

ఇంతలో మధు అక్కడికొచ్చాడు. "ఇడిగో వీడే మా మూడో అబ్బాయి మధు. B.D.S చేసి మాకు తెలిసిన నర్సింగ్‌హోంలో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వాడితోడు మాకు, మా ఆలంబన వాడికి అవసరమని తెలుసుకున్న నేను వాడి కొరకే హైదరాబాద్‌లో, సొంత ఇంటిలో ఉంటున్నాను" అన్నారు శాస్త్రిగారు.

"బాగుందండీ! మీ కిష్టమైన పనులతో హాయిగా, ఆరోగ్యంగా, విశ్రాంతిగా ఉండండి, ఇక మేము బయలుదేరుతాం" అంటూ మిత్రులంతా వెళ్ళిపోయారు.

మరో నాలుగు నెలలకు శాస్త్రిగారింట్లో బంధుమిత్రులంతా ఓ మంచి కార్యక్రమానికి కలిశారు. భోజనాలైనాక, శాస్త్రిగారు తమ్ముడితో, "ఒరేయ్, నా షష్టిపూర్తినాడు నా మూడవ కోరికేమిటో చెప్పమన్నారు కదా, అది మా మధు సాయంచేసి, తీర్చేశాడురా. మనమంతా ఇప్పుడు ఓ ప్రదేశానికి వెళ్ళబోతున్నాం. రెండు క్యాబ్స్ బుక్‌చేయరా" అంటూ మధుకి పురమాయించారు.

అంతా కలసి ఉస్మానియా మెడికల్ కాలేజి దాటి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ఆఫీస్ దగ్గరకు వచ్చారు. "ఆసరా" అన్న బోర్డ్ వారి చూపులనాకర్షించింది. రెండు చిన్న గదులతొ ఉన్న ఆఫీస్ అది. శాస్త్రిగారు ఆ ఆఫీస్ గురించి చెపుతూ, "ఇది ఒక కౌన్సలింగ్ సెంటర్. నేను, నా భార్యా మధు గురించి పడ్డ వేదన మరి ఏ అమ్మానాన్నలు పడకూడదు. ఆవిధంగా ర్యాగింగ్, వేధింపులు, యాసిడ్ దాడులు, వరకట్న సమస్యలు, మొదలైన వాటికి బలవుతున్న పిల్లలకందరికి ఇక్కడ కౌన్సలింగ్ ఇచ్చి ధైర్యం కలిగిస్తాం. వారికి భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తామిక్కడ. అలాగే ఇలాంటివి చేసే పిల్లలను, వారి తల్లిదండ్రులను పిలచి వారికి సరైన కౌన్సలింగ్ చేయటం జరుగుతుంది. ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన "షీ టీంస్" వల్ల కొంత ప్రయోజనమున్నా, అసలు మూలాలను పెరికివేస్తేగాని ఈ వ్యవస్థలో మార్పురాదు. అందుకనే సమాజసేవ చేయాలనే దృక్పధమున్న కొంతమంది సైకాలజిష్టులను, డాక్టర్లను పిలచి వారితో కౌన్సలింగ్ ఇప్పించటం జరుగుతుంది.

నా మూడవ కోరికకు ప్రేరణగా నా మూడవ కొడుకే నిలవడం యాదృచ్ఛికం. మధు కూడా గత సంవత్సరంగా నా కౌన్సెలింగ్ లోనే ఉత్తేజితుడై జాబ్‌లో చేరాడు. దానితో నా మీద నాకు నమ్మకం కుదిరి, ఈ "ఆసరా" ను స్థాపించాను. జీవితంలో దెబ్బతిన్న పిల్లలందరికి, మంచి దారిలోకి రావటానికి, ఆత్మవిశ్వాసంతో నడవటానికి ఈ సంస్థ సహాయపడుతుంది. రామాయణ, భారత పురాణాలలోని ఉదాహరణలను, దేశం కోసం జీవితాలను ధారపోసిన గొప్ప వ్యక్తుల జీవిత ఘట్టాలను చిన్నచిన్న డాక్యుమెంటరీలుగా తయారుచేసి ఈ కౌన్సెలింగ్‌లో వాడుకోవటానికి ప్లాన్ చేశాను" అంటూ తన బంధుమిత్రులకు "ఆసరా" కు తన మూడవ కోరికకు గల సంబంధాన్ని వివరించి చెప్పారు.

శాస్త్రిగారి మూడవ కోరిక అన్నింటికన్నా భిన్నమైంది, గొప్పది అని అందరికీ అనిపించింది.

******

# తెలుగు తేటలు

## Whatsapp నుండి సంగ్రహణం, రచయిత ఎవరో తెలియదు.

తెలుగు భాషాభిమానం ఉన్న ఒక కుటుంబం అంతా కలిసి పెళ్ళి చూపులకెళ్ళారు. అబ్బాయి తల్లి, అమ్మాయికి తెలుగు భాషలో ఎంత ప్రావీణ్యం ఉందో, నా కోడలయ్యే అర్హత ఉందో లేదో తేల్చేస్తా .. అంటూ అమ్మాయిని, 'మీ యొక్క విద్యాభ్యాసం ఎంత వఱకూ జఱిగింది' అని అడిగింది. దానికి ఆ అమ్మాయి 'కన్ను కన్ను తేనీరూ' అని సమాధానం చెప్పింది. అబ్బాయి తల్లి, 'అంటే?' అని అడిగింది. అమ్మాయి, 'IIT' అని చెప్పి నవ్వింది.

పాపం అబ్బాయి తల్లి షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు.

With Best Compliments from



Ram & Girija Kolluri

---

With Best Compliments from



Eppanapally Family

# ప్రేరణ

దినవహి సత్యవతి

పూర్వం కంఠీరవ సామ్రాజ్యాన్ని పరిపాలించిన మహారాజు నరేంద్ర భూపతి, రాణి ఇందుమతి దంపతుల ఏకైక పుత్రుడు ఇంద్ర భూపతి. ఇంద్రకు పుట్టుకతోనే ఉన్న చిన్న అంగవైకల్యం - కుడిచేతికి బొటనవ్రేలు లేకపోవడం!

కౌమార్యంలో ప్రవేశించే తరుణానికే సకల శాస్త్రాలలో ప్రావీణ్యతను సంపాదించి విద్య, వైద్య, వాణిజ్య, సేంద్రీయ రంగాలలోని మెళకువలన్నీ క్షుణ్ణంగా అవపోసనపట్టిన ఇంద్ర తన కుడిచేతికి బొటనవ్రేలు లేకపోవడంచేత విలువిద్య, కత్తివిద్య మాత్రం నేర్వలేకపోయాడు.

ఊహ తెలిసినప్పటినుండీ అంగవైకల్యం ఇంద్రని అమితంగా బాధించసాగింది. కుమారుని కలత తల్లిదండ్రులు గమనించి 'నాయనా ఏమైంది? ఎందుకలా ఉంటున్నావు?' అని పదే పదే ప్రశ్నించినా 'ఏమీ లేదు' అనే ఇంద్రనుండి సమాధానం వచ్చింది కానీ ఆతడి బాధకి అసలు కారణం మాత్రం వారికి తెలియరాలేదు.

యవ్వనవంతుడైన ఇంద్రకి పట్టాభిషేకం జరపదలచి ముహూర్తం నిశ్చయించి యువరాజ పట్టాభిషేకం వార్త రాజ్యమంతా చాటింపు వేయించాడు రాజు నరేంద్ర.

ఆ వార్త విని 'రాజ్యానికి సంబంధించిన ఎటువంటి అధికారం చేపట్టడానికైనా ఒక వ్యక్తి సకల విద్యలలోనూ నిష్ణాతుడై ఉండాలి, కానీ నాకున్న అంగవైకల్యం వలన నేను కత్తి యుద్ధం చేయలేను, విల్లు చేపట్టలేను. కనుక రాజ్యాధికారం చేపట్టడానికి నాకేమాత్రం అర్హతలేదు' అని తానే నిశ్చయించుకుని, తల్లిదండ్రులకి లేఖ వ్రాసి దేశాటన నెపంతో ఆనాటి రాత్రే రాజ్యం విడిచి వెళ్ళిపోయాడు ఇంద్ర.

!+!+!+!+!+!+!+!+!+!+!

ఇంద్ర తన అంగవైకల్యం కానరాకుండా వేషం మార్చుకుని దేశాటన చేస్తూ నాలుగు మాసాల అనంతరం ఒక గ్రామానికి చేరుకున్నాడు. ఆ గ్రామంలో ఒక చెట్టు క్రింద చాలా మంది గ్రామస్థులు గుమిగూడి ఉండడం చూసి అటుగా వెళ్ళాడు. అక్కడ రచ్చబండ పై ఐదుగురు వ్యక్తులు ఆసీనులై ఉన్నారు. వారి ఎదురుగా ఒక మధ్య వయస్కుడైన వ్యక్తి నిలబడి ఉన్నాడు.

'ఇక్కడేదో పంచాయితీ జరుగుతున్నట్లుగా ఉంది' అనుకున్నాడు ఇంద్ర.

ఇంతలో రచ్చబండ పై కూర్చున్న పెద్దలలో ఒకరు 'భద్రయ్యా! గత రెండేళ్ళనుండీ శిస్తు కట్టని కారణంగా నీ పొలంలోని కొంత భాగం పంచాయితీకి శిస్తు క్రింద జమా చెయ్యాలని తీర్మానించిడమైంది. ఇందులో నువ్వు చెప్పుకోవలసినదేమైనా ఉన్నదా?' ప్రశ్నించారు నిలబడిన వ్యక్తిని.

'పెద్దలందరికీ దండాలు. మునుపు రెండేళ్ళూ తుఫానొచ్చి, కల్తీ విత్తనాలతో మోసపోయి.... రక రకాల నష్టం జరిగి పంట చేతికి రాక శిస్తు కట్టలేకపోయాను నిజమే. అలాగని ఇప్పుడు శిస్తు క్రింద పొలంలో కొంత భాగం జమాసేసుకుంటే నాగతేంకాను? నేనేం తినాలి ఈడొచ్చిన పిల్ల పెళ్ళెలా సేయాలి? పెద్దలు దయదలిసి మరొక్క ఏడాది గడువిస్తే....' అని ప్రాధేయపడ్డాడు.

భద్రయ్య అభ్యర్థన విని తమలో తాము చర్చించుకుని 'సరే గడువిస్తున్నాము కానీ నువ్వడిగినట్లు ఏడాది కాదు కేవలం ఎనిమిది మాసాలు మాత్రమే. అప్పటికీ శిస్తు చెల్లించలేకపోతే పంచాయితీ నిర్ణయం అమలు జరుగుతుంది' అని తెలిపారు పెద్దలు.

అందరితో పాటు ఇంద్ర కూడా పంచాయితీ పెద్దల నిర్ణయానికి హర్షధ్వానాలు చేసాడు.

'దండాలయ్యా గడువిచ్చినందుకు' అని పెద్దలకి నమస్కారం పెట్టి అక్కడనుండి కదిలాడు భద్రయ్య.

పేదరైతు భద్రయ్య మాటతీరు, పలుకులలో నిజాయితీ ఇంద్రని ఎంతగానో ఆకట్టుకోగా ఆయనను వెంబడిస్తూ అతడూ కదిలాడు. ఆలోచిస్తూ వెళుతున్న భద్రయ్య అడుగుల సవ్వడికి వెనుదిరిగి చూసాడు.

ఒక అందమైన యువకుడు తనని వెన్నంటి వస్తూండడం చూసి 'ఈ కుర్రాడెవరో సూడ్డానికి మారాజు బిడ్డలాగున్నాడు' అనుకుని 'బాబూ ఎవర్నువ్వు? నా వెనకాతల వస్తున్నావెందుకు?' అని అడిగాడు

'ఇందాక పంచాయితీలో జరిగినదంతా చూసాను మీరు నాకేదైనా పనిస్తారేమోననీ.............'

'నాకే గడవడానికి ఇబ్బందిగా ఉంటే ఇంక నీకేమి పనివ్వగలను? బదులుగా ఏమీ ఇవ్వలేని ఈ పేదోడివల్ల నీకేం లాభముండదు బాబూ, వెళ్ళు'

'మీరలా అనుకోవద్దు. వ్యవసాయంలో గత రెండేళ్ళుగా మీరెలా నష్టపోయిందీ పంచాయితీలో చెప్తుంటే విన్నాను. నాకందులో కొన్ని మెళకువలు తెలుసును. నేను కొంతైనా మీకు సహాయపడగలిగితే నా విద్యకు సార్థకత చేకూరిందని అనుకుంటాను. అందుకే ఎంత చిన్న పనైనా ఫరవాలేదు చేస్తాను బదులుగా మీరేమీ ఇవ్వనక్కరలేదు'

పేదవాడైనా చాలా తెలివి కలవాడైన భద్రయ్య 'సరే పద నువ్వింతగా చెప్తుంటే నేనెందుకు కాదనాలి' అని ఇంద్రని తన ఇంటికి తీసుకొచ్చాడు.

భద్రయ్యది వసారా ఉన్న రెండు గదుల చిన్న పెంకుటిల్లు. ఇంటి చుట్టూ పూల మొక్కలు. విరిసిన పూల పరిమళాలు నలుదిశలా వ్యాపించి ఆహ్లాదాన్ని కలుగచేస్తున్నాయి.

వసారాలో నులక మంచం వాల్చి 'కూర్చో' అని ఇంద్రకి చెప్పి 'అమ్మాయ్ సుధీరా' అని పిలుస్తూ ఇంట్లోకి వెళ్ళాడు భద్రయ్య.

'సుధీర.... చక్కటి పేరు, భద్రయ్యగారు పంచాయితీలో చెప్పినది ఈమె పెళ్ళి గురించేనేమో' అనుకున్నాడు.

భద్రయ్య ఇచ్చిన కమ్మటి మజ్జిగతో దాహం తీరగా కృతజ్ఞతలు తెలిపాడు ఇంద్ర.

ఇంటికి వచ్చిన అతిథిని మర్యాదకైనా పలుకరించని సుధీర ప్రవర్తన కొంత వింతగా అనిపించినా 'పరిచయం లేని వ్యక్తి ముందుకి రావడానికి ఆమె మొహమాట పడుతున్నదేమో??' అనుకున్నాడు ఇంద్ర.

ఆ రాత్రికి ఇంద్రకి వసారాలో తనతోపాటే పడక ఏర్పాటు చేసాడు భద్రయ్య. ఆ మర్నాడు ఇంద్ర చేయందించగా పెంకుటింటికి కొంచం దూరంగా అతడి కోసం చిన్నపాక వేసాడు. తరువాత ఇద్దరూ కలిసి పొలం చూడటానికి వెళ్ళారు. భద్రయ్యకి రెండెకరాల పొలంలో కొంత భాగమే సాగుబడిలో ఉండటం గమనించాడు ఇంద్ర.

పొలంలో ఒక కొసన ఉన్న చెరువును చూపి 'చానాళ్ళ క్రితమే పూడిపోయింది' చెప్పాడు భద్రయ్య

'కొంచం కష్టపడి ఈ చెరువు పూడికతీస్తే వానలకు కొంతైనా చెరువు నిండి నీటి ఎద్దడి తగ్గుతుంది' అన్నాడు ఇంద్ర

'మంచి ఆలోచన. ఇందుకోసమే ఆ దేవుడు నిన్ను పంపినట్లుంది' అంటూ మెచ్చుకున్నాడు భద్రయ్య.

వెంటనే చుట్టుప్రక్కల నలుగురిని కూడగట్టి, చెరువు పూడిక తీయడంలో సహాయపడినట్లయితే వారికి కూడా కొంత నీరు ఇచ్చేలాగా, ఒప్పందం చేసుకున్నారు భద్రయ్య ఇంద్ర.

చెరువు పూడిక తీసేపని పూర్తవుతుండగానే, మానవ ప్రయత్నానికి దైవం కూడా తోడయ్యాడన్నట్లుగా గట్టి వాన పడి చెరువు నీళ్లతో నిండి కళ కళలాడింది. భద్రయ్య సంతోషం మిన్నంటింది.

ఇంద్ర సహాయంతో మేలురకం విత్తనాలు కొని పొలంలో చల్లి రెండు పంటలు వేశాడు భద్రయ్య.

తరువాతి రోజుల కాలంలో సుధీరని ఒకటి రెండుసార్లు, అది కూడా, దూరంనుండి మాత్రమే చూసిన ఇంద్ర ఆమె అద్భుత సౌందర్యాన్నిగని ఆమెని ఇష్టపడ్డాడు.

ఒకనాడు ఉదయానే భద్రయ్య అత్యవసరమైన పనిపై వెళుతూ 'నేవచ్చేదాకా ఇంటిని, అమ్మాయినీ కొంచం కనిపెట్టి ఉండు బాబూ' అని తమ తోటలో పూలమొక్కలకు సంరక్షణ చేస్తున్న ఇంద్రకి చెప్పాడు.

కొద్దిసేపటికి సుధీర ఇంట్లోంచి బయటకు వచ్చి తన వెనుకగా పూలమొక్కలవైపు రావడం పనిలో నిమగ్నమై ఉన్న ఇంద్ర గమనించలేదు. ఏదో అలికిడైనట్లై లేచి వెనుదిరగబోయాడు.

కానీ అప్పటికే సుధీర అతడికి దగ్గరగా వచ్చేయడం, అతడిని తట్టుకుని పడిపోయి 'అమ్మా' అంటూ బాధగా కేకపెట్టడం రెప్పపాటుకాలంలో జరిగిపోయాయి.

వెంటనే ఆమెను చేయిపట్టి లేవదీసి 'నేనంటే అటుతిరిగి ఉన్నాను కాబట్టి మీరు రావడం కనిపించలేదు కానీ మీరు కళ్ళకు ఎదురుగానే ఉన్న నన్నెలా చూడలేదు?' కోపంగా ప్రశ్నించాడు

ఇంద్ర మాటలకి బాధపడిన సుధీర 'మీరెంతో అదృష్టవంతులు అన్నీ చూడగలరు కానీ నేను దురదృష్టవంతురాలిని, గ్రుడ్డిదాన్నైనందున ఏమీ చూడలేను' అని ఏడుస్తూ అతడి చేయి విడిపించుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

సుధీర మాటలకు నిశ్చేష్టుడై నిలబడిపోయిన ఇంద్రకి ఆమె అంధురాలు అనే నిజం ఒకంతట మింగుడుపడలేదు.

భద్రయ్య తిరిగివచ్చి కూతురి ముఖతః జరిగినది తెలుసుకుని వెంటనే వచ్చి ఇంద్ర చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపాడు.

'నిజానికి మీరే నన్ను క్షమించాలి సుధీరకి చూపులేదని తెలియక ఆమెను కోపగించుకున్నందుకు. ఆమె అన్ని పనులూ తడబాటులేకుండా చేసుకోవడం వలన నాకసలు అటువంటి అనుమానమే కలుగలేదు' కించిత్ పశ్చాత్తాపం నిండిన స్వరంతో అన్నాడు.

'నీకే కాదు బాబూ ఎవ్వరికీ అనుమానం కలుగదు. చూపు లేకపోయినా సుధీరకు గ్రహింపుశక్తి ఎక్కువ. మొదట్లో నన్ను అడిగి ఏవెక్కడ ఉన్నాయో తెలుసుకుని, వాటినొకసారి చేత్తో ముట్టుకుని ఆ స్పర్శ జ్ఞాపకం పెట్టుకోవడం నేర్చుకుంది. ఇప్పుడు చూపున్న వారితో సమానంగా అన్ని పనులూ ఎంతో సమర్థవంతంగా నిర్వహించుకోగలదు నా కూతురు' అన్నాడు గర్వం కంఠంలో తొణికిసలాడిస్తూ!

'అసలామెకు చూపెలా పోయింది?'

'అంతా దురదృష్టం. కుందనపు బొమ్మలా ఉండే నా బిడ్డకి పసివయసులో ఒకసారి విపరీతమైన జ్వరం వచ్చింది. అప్పుడు చూపు దెబ్బతిన్నదని వైద్యులు చెప్పారు. ఆ బెంగతో వాళ్ళమ్మ కన్ను మూసింది' చెప్పాడు భద్రయ్య

'మరింక ఆమెకు చూపు వచ్చే అవకాశమే లేదా?'

'వేరెవరి కళ్ళైనా సుధీరకు పెడితే చూపు రావచ్చుట. అది చాలా ఖర్చుతో కూడిన పని, నాకంత తాహతు లేక అమ్మాయి అదృష్టమింతేలే అని సరిపెట్టుకున్నాను' అని ' భోజనాలప్పుడు కలుద్దాము' చెప్పి వెళ్ళిపోయాడు భద్రయ్య. సుధీర గురించి నిజం తెలిసి కలత చెందాడు ఇంద్ర.

ప్రాపంచిక విషయాలతో తనకు సంబంధం లేదంటూ కాలచక్రం మరో ఐదు మాసాలు ముందుకు కదిలింది.....

!+!+!+!+!+!+!+!+!+!+!

గడచిన కాలంలో మరింత నిశితంగా, అంధురాలైన సుధీర ఎంతో సమర్ధవంతంగా తన పనులు చేసుకోవడం, తండ్రికి కూడా సమయానికి అన్నీ అమర్చిపెట్టడం, అత్యంత చాకచక్యంగా మసలడం, గమనించాడు ఇంద్ర.

సుధీరలో లేశమాత్రమైనా తాను అంధురాలనే న్యూనతాభావం గోచరించలేదు ఆతడికి. క్రమేణా ఆమె పట్ల ఇంద్ర ఇష్టం ప్రేమగా పరిణమించింది.

సుధీర అసమాన ఆత్మస్థైర్యం చూసిన ఇంద్ర మనోనేత్రానికి స్పష్టంగా ఒక విషయం గోచరమైంది.

'చూపులేని అంగవైకల్యంతో సుధీర రవ్వంతైనా వెరువక తన బాధ్యతలన్నీ నిర్వహించుతుంటే అన్నీ ఉన్న నేనెందుకు కేవలం బొటనవ్రేలు లేదని కృంగిపోయి బాధ్యతలకు భయపడాలి? నేను బాధపడుతూ, తల్లిదండ్రులనూ బాధపెడుతూ అందరిపట్లా నా కర్తవ్యం విస్మరించాను. అంతేకాదు అంగవైకల్యం కలిగిన ఏ వ్యక్తి అయినా ఆత్మస్థైర్యం ఉంటే ఆ లోపాన్ని అధిగమించవచ్చు అని సుధీరను చూసాక అవగతమైంది. నా తక్షణ కర్తవ్యమేమిటో కూడా తెలిసివచ్చింది' అనుకుని ఒక నిశ్చయానికి వచ్చాడు.....

మరుసటి నెల వరిపంట చేతికొచ్చింది. అందులో కొంత అట్టేపెట్టుకుని, మిగిలినది అమ్మి శిస్తులు బకాయి లేకుండా పూర్తిగా చెల్లించి, లాభాలు చూసిన భద్రయ్య కూతురి పెళ్ళి నిరాటంకంగా చెయ్యొచ్చని సంతోషించాడు. ఇంద్ర చేసిన సహాయాన్ని వేనోళ్ళ పొగిడాడు భద్రయ్య....

ఆ మరునాడు తనకు ఇన్నాళ్ళూ ఆశ్రయమిచ్చి, ఆదరించినందుకు భద్రయ్యకూ, సుధీరకూ కృతజ్ఞతలు తెలిపి తన రాజ్యానికి తిరిగి వచ్చాడు ఇంద్ర.

దేశాటనచేసి వచ్చిన కుమారుడిలో ఇనుమడించిన ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటమై రాజదంపతుల ఆనందాన్ని ద్విగుణీకృతం చేసింది. రాజకుమారుడు తిరిగొచ్చాడని తెలిసి కంఠీరవ రాజ్యప్రజలు సంబరాలు చేసుకున్నారు.

రాజగురువు నిశ్చయించిన శుభముహూర్తానికి ఇంద్రకి మహావైభవంగా 'యువరాజ పట్టాభిషేకం' జరిపించాడు నరేంద్ర మహారాజు.

తదుపరి తల్లిదండ్రులకు ఇంతకాలం తానెక్కడున్నదీ వివరించి, సుధీర గురించి సమస్తమూ తెలిపి 'తండ్రీ ఈనాడు నేను తిరిగి మీ వద్దకు వచ్చానంటే అందుకు ప్రేరణ సుధీర. ఆమెను వివాహమాడడానికి అనుమతించవలసినది' అని వేడుకున్నాడు.

కుమారుని నిర్ణయానికి ఎంతో సంతోషించి భద్రయ్యను, సుధీరను రాచమర్యాదలతో రాజ్యానికి రప్పించాడు నరేంద్ర మహారాజు. ఇంద్ర తానూహించినట్లుగానే రాచబిడ్డ అని తెలిసి పొంగిపోయాడు భద్రయ్య. రాజవైద్యుల సహాయంతో సుధీరకు చూపు తెప్పించాడు రాజు నరేంద్ర.

'కర్తవ్యదీక్షాపరులు తమ అంగవైకల్యము కార్యసాధనకు ఒక అవరోధమని తలచక విజయం సాధించగలరు' అన్న దానికి ప్రత్యక్ష నిదర్శనమై నిలచి తనకు ప్రేరణనిచ్చి తనను కర్తవ్యోన్ముఖుడను చేసిన సుధీరను వివాహమాడాడు ఇంద్ర.

తన పేరుతో సుధీర పేరును జోడించి 'ధీరేంద్ర' గా మార్చుకుని ఆమెపై తన అవ్యాజమైన ప్రేమను చాటుకున్నాడు. ఇరవయ్యేదేళ్ల వయసులో కంఠీరవ రాజ్యాధికార పగ్గాలు చేపట్టిన ధీరేంద్ర, సుధీరకు రాజ్యంలో సమభాగమిచ్చి ఆమె సలహా సహకారాలతో ప్రజారంజకంగా పరిపాలించి అందరి ప్రశంసలందుకున్నాడు.

*************



Government of School Education of AP

&

*Paatasala Inc., A 501 C (3) Certified, Non Profit Organisation*

సమర్పించు

# తెలుగు పలుకు

4 సంవత్సరాల తెలుగు బోధన

...ఆన్‌లైన్‌ద్వారా కూడా తెలుగులో శిక్షణ

## Register Online Today | Registrations Open!!

## Classes begin from SEPTEMBER 2019-20

### Centres

### ROBBINSVILLE | SOMERSET | NORTH BRUNSWICK

* ఎన్ఆర్ఐ తెలుగు పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల ఇంక్, యుఎస్ఎ అందిస్తున్న అపురూప కానుక
* 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు క్లాస్ రూమ్ మరియు ఆన్ లైన్ ద్వారా తెలుగు బోధన
* 2వ మరియు 4వ సంవత్సరాంతంలో ఉతీర్ణులైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికేట్ ల ప్రదానం
* శాస్త్రీయ పద్ధతిలో రూపొందించిన సిలబస్
* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలు

**Courses:**
TAARANGAM | PALUKU
ADUGU | PARUGU | VELUGU

**Fee $250**

Contact Details:

| RAM VEDANTHAM | KUMAR TADEPALLI | ROJA VENKAT |
|---|---|---|
| Area Director - (732) 543-4655 | Center Director - (609) 619-1790 | Center Coordinator - (732) 762-1835 |
| SOMERSET | ROBBINSVILLE | NORTH BRUNSWICK |

Registrations at
**www.paatasala.net**

మన తెలుగు.. మన పిల్లల కోసం...

paatasala4usa

# ఒక దీపం వెలిగింది

యలమర్తి అనూరాధ

పక్షులు కువకువమన్నా

ఆకులు గలగలమన్నా

చినుకులు రాలటం ప్రారంభమైనా

చిరుగాలి ప్రియురాలులా పలకరించి సేదతీర్చి వెళ్లినా

మనసు ఎటో వెళ్లిపోతుంది.

అమ్మ 'ఆత్రేయ' గారి మీద ఇష్టంతో తనకు అలా పేరు పెట్టటం తను ఇలా ప్రకృతి ప్రేమికుడు అవటం యాదృచ్ఛికమో కాదో తెలియదు కానీ తను ప్రేమ పిపాసికుడు అని మాత్రం కచ్చితంగా చెప్పగలడు. ఎందుకంటే వీటినే ప్రేమించేవాడు అందర్నీ ప్రేమించగలడు కాబట్టి.

అందాన్ని ఆరాధించటం తనకు ఉన్న పెద్ద జబ్బు.ఒక రోజు ఫేస్ బుక్ లో అందాలన్నీ ఒక్క మోములోనే కట్టిపడేసినట్లున్న ఓ అమ్మాయి స్నేహ అభ్యర్ధన హృదయాన్ని తాకింది.

అంతే ! క్షణం ఆలోచించకుండా ఒప్పేసు కున్నాను.ఇక అప్పటినుంచీ గంటలు క్షణాలులా గడిచిపోవడం మొదలెట్టాయి.

ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి నిద్ర పోయేవరకూ ఆమె మాట వినకపోతే పిచ్చెక్కి పోయేవాడిని. ఆమె నవ్వు జలపాతంలా ఆనందాన్నిచ్చేది. సంగీతాన్ని తలపించేది.

ఎన్నో కబుర్లు.. మరెన్నో ఉసులు.. జ్ఞాపకాలుగా దొర్లిపోతున్నాయి.ఇక ఆమె లేకుండా క్షణం బ్రతకలేని పరిస్థితుల్లోకి జారిపోయాను. అందరిలా ఒకరితో ప్రేమ మరొకరితో పెళ్లి అనుకునే వాడిని కాదు.ఏది చేసినా మనస్ఫూర్తిగా చేయాలి అనే తత్వం.ఇక తనని ఆడిగేయ్యాలి అనుకున్నాను.

చెల్లి పెళ్లి చేయవలసిన బాధ్యత తన మీద ఉంది.అది వదిలేసి తన పెళ్లి గురించి ఆలోచిస్తే అమ్మ ఏమనుకుంటుంది ?

ఆ అమ్మాయిని అడిగి ఒప్పుకున్నాక ఇది చెబితే బాగుంటుందా?

అసలు ఆ అమ్మాయి ఒప్పుకుంటుందా? ఇంతకుముందు ఎవరినైనా ప్రేమించిఉంటుందా ? ఏమో? ఏమీ తెలియదు. కానీ తనతో చాలా ఆత్మీయంగా మాట్లాడుతుంది. దాపరికం లేకుండా తనకు అన్నీ చెబుతుంది. అలా చెప్పేది ఒక ప్రేమించిన వారికే కదా!

రెండు విరుద్ధ భావాలు యుద్ధంచేసుకుంటున్నాయి మనసులో. కొన్నాళ్లకు తనే బయటపడుతుందేమో.అప్పుడు మాట్లాడితే అనుకుని అప్పటికి ప్రేమ విషయం చెప్పటానికి వాయిదా వేసుకున్నాను నాకు నేనే. ఆలస్యం అమృతం విషం అంటారు. పరిగెత్తి పాలు త్రాగేకన్నా నిలబడి నీళ్లు త్రాగమనీ అంటారు.ఇందులో ఏది అవలంబించాలి? రెండూ భలే సందిగ్ధతలో పడేస్తాయి.

అలాగే రోజులు నెలలు గడిచిపోతున్నాయి. తమ మధ్య పెళ్లి మాటలు తప్ప అన్నీ వచ్చేస్తున్నాయి. అడిగినా ఏ అమ్మాయీ తనని కాదనదు. అందగాడు. మంచి జీతం వస్తోంది. ఆడపిల్ల కలలు కనే సాఫ్ట్ వేర్. అసలు సందేహపడవలసిన పనే లేదు. తనని చూసి తనే మురిసిపోయాడు గొప్పగా.

కానీ అవతల అమ్మాయి కూడా చాలా అందగత్తే. ఆ కోణంలో కూడా ఆలోచించాలిగా. మనసు ఏమాత్రం ఒప్పుకునేది కాదు. అమ్మ ఆశావాదంగా ప్రతీ విషయం ఆలోచించాలని చిన్నతనం నుంచీ నేర్పించింది. ముందే నిరాశావాదాన్ని ఆశ్రయిస్తే ఏ పనీ చెయ్యి బుద్ధి కాదు నాన్నా!ముందుకు వెళ్లాలంటే ఇలాగే ఆలోచించాలి. కాకపోతే ఏ విషయమైనా మంచి చెడులు చూసుకోవాలి ముందే అనేది.

ఆ ముందువి బాగా గుర్తించాడు. ఈ చివరిది కూడా మంచిగానే ఉందిగా అనుకున్నాడు.ఈ కాలంలో ఎవరి కోసం ఎవరూ సమయాన్ని ఇవ్వరు. నిస్వార్ధంగా తన కోసం ఇంత కాలాన్ని వెచ్చిస్తోందంటే మరి ఏమనుకోవాలి ?

ఇలా సాగుతుండే ఆలోచనలను రోజూ నీళ్లు, ఎరువు వేసి మొక్క లాగా పోషించసాగాడు.అది గొంతుదాకా పెరిగిపోయింది. ఇక మింగలేక కక్కలేని పరిస్థితి వచ్చింది. ఈరోజు ఎలాగైనా చెప్పాలి అనుకున్నాడు.

అప్పుడే అటు నుంచి "రాజా!" అని ముద్దుగా పిలిచింది అలేఖ్య. అది ఆమె నన్ను ముద్దుగా పిలిచే పిలుపు.

"దీపావళి నీ పుట్టినరోజు కదా! నీకు మంచి బహుమతి ఇవ్వాలని ఉంది. దూరంగా ఉన్నాను కదా! కొని తెచ్చి ఇవ్వలేను. నీకు ఇష్టమైనది నువ్వే నా పేరున కొనుక్కో. నేను డబ్బులు పంపిస్తాను. అలా చెయ్యకపోతే నా మీద ఒట్టే." అంది గోముగా.

"అబ్బా! తన మీద ఎంత ప్రేమ లేకపోతే ఇలా మాట్లాడుతుంది? అమెరికాలో ఉన్నా మన సంప్రదాయాలను ఎంత పాటిస్తోంది? మనసు ఉబ్బితబ్బిబ్బయిపోయింది.

" ఏమిటి మాట్లాడవ్?సరేనా!" మళ్లీ అంది.

తనది హస్కీ వాయిస్. ఎన్ని గంటలు మాట్లాడినా అలా వినాలనిపిస్తుంది.

"వద్దు. నీ ప్రేమే నాకు చాలు. ఈ బహుమతులేం వద్దు "అన్నాను.

"ఈ ఒక్కసారికీ నా ముచ్చట తీర్చు. ఆ తర్వాత నువ్వు చెప్పినట్లే వింటాను." అనటంతో సరే అనక తప్పలేదు.

నీ అకౌంట్లో డబ్బులు వేయడానికి ఒక్క రూపాయి వేయమని చెప్పింది. తన వివరాలు పంపింది మెసేజ్ లో. ఆ మెసేజ్ ని ఓపెన్ చేసి అందులో తన వివరాలు చెప్పి ఒక రూపాయి వేసి తిరిగి ఆ మెసేజ్ లింకును ఆమెకే పంపించాడు.

లోలోపల ఆడపిల్లలా తెగ సిగ్గుపడిపోయాడు కూడా. ఎందుకంటే ఆడపిల్లలందరూ ఎక్కువుగా అబ్బాయిల దగ్గర్నుంచి దోచుకోవాలని చూసేవారే.తనకి ఇలాంటి స్నేహితురాలు దొరికింది కదా అని తలుచుకుని తలుచుకుని మురిసిపోయాడు.

ఆనందం విషాదం అవటానికి క్షణం చాలు. అది తెలియని వారు ఉండరు.కానీ అది తమ జీవితాల్లో జరుగుతాయని ఊహించటానికి ఎవరూ ఇష్టపడరు.కానీ జరగవలసినవి జరిగిపోతాయి. అలాగే తన జీవితంలో కూడా!

*　　*　　*

కొద్ది క్షణాల్లోనే తన ఖాతాలోని 10 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. బిత్తరపోయాడు.వెంటనే ఆమెకు ఫోన్ చేశాడు.స్విచ్ ఆఫ్ అని వచ్చింది. మోసపోయాడు అని తెలిసినా నమ్మబుద్ధి కాలేదు.ఆమె పైన అంత నమ్మకం పెంచుకున్నాడు మరి. చెల్లి పెళ్లి కోసం పైసా పైసా కూడబెట్టిన డబ్బు అది.

పిచ్చి పట్టినట్లయ్యింది.జుట్టుపీక్కున్నాడు. డబ్బు పోవటం ఒకటైతే రెండవది తను ప్రేమించింది ఒక మోసగత్తెనన్న విషయం మరొకటి.గుండెను ఎవరో మెలిత్రిప్పుతున్నంత బాధ.

ఈ నిజాన్ని ఆరాయించుకోలేకపోతుంది తన మనసు.

అలా ఎలా చేసింది? ఎంత నమ్మించింది ?

కాసేపటి తర్వాత తన మనసుకి తనే సర్దిచెప్పుకొని సైబర్ క్రైమ్ పోలీసులు కి ఫోన్ చేశాడు.

సైబర్ పోలీసులు చెప్పిన విషయం విని నిర్ఘాంతపోయాడు.

"మీరు మోసపోయారు. వాళ్లు సైబర్ నేరగాళ్లు. ఈ అమ్మాయి కూడా అలాంటిదే. రూపాయి పంపమని చెప్పి ఆమె నకిలీ మెసేజ్ లు మీకు పంపింది. దానిని ఓపెన్ చేసి అందులో వివరాలు మీరు ఎంటర్ చేస్తున్న సమయంలో అవన్నీ సైబర్ నేరగాళ్ల వద్ద కాపీ అయ్యేవిధంగా టెక్నాలజీని వినియోగించారు.

రూపాయి చెల్లించడం కోసం యూపీఐ ఖాతాను ఉపయోగించటంతో ఆ వివరాలు పిన్ నెంబర్ తో సహా ఆమెకు తెలిసిపోయింది. దీనితో మీ ఖాతా నుంచి మొత్తం డబ్బును ఆమె కొల్లగొట్టింది "అని చెప్పటంతో కళ్ళు తిరిగి పడిపోయాడు.

అమ్మ వచ్చి నీళ్ళు చల్లటంతో లేచి కూర్చున్నాడు.

"ఏమయ్యింది? భోజనానికి రమ్మని పిలుద్దామని వస్తే నువ్వు స్పృహ లో లేవు. డాక్టర్ కి ఫోన్ చేయనా "కంగారుగా అతని నుదురును తాకుతూ అందావిడ.

భోరుమన్నాడు ఆత్రేయ.

ఆవిడకు ఏమీ అర్థం కాలేదు ముందు.

ఆ తర్వాత తల పట్టుకుంది ఆత్రేయ చెప్పింది అంతా విన్నాక.

"అయ్యో తన బిడ్డ మామూలుగా కాదు ఘోరంగా మోసపోయాడు. అవతల అమ్మాయి ఎంత కర్కోటకురాలు? తన బిడ్డ డబ్బుల్నే కాదు మనసును కూడా మోసం చేసింది. భగవంతుడా !నా బిడ్డ ఈ కష్టాన్ని ఎలా తట్టుకుంటాడు?

పిల్ల పెళ్లి ఎలా చేయాలి?

వీడు మామూలు మనిషి అవుతాడా?

ఈ ఫేస్ బుక్ ల పరిచయాలు పెంచుకోవద్దు అని పేపర్లలో రోజుకో సంఘటనలు వస్తున్నా ఈ పిల్లలు ఇలా బలి అయిపోతూనే ఉన్నారు. ఇన్నాళ్ళు వాళ్లను చూసి జాలి పడింది తను. ఇప్పుడు ఆ జాబితాలోకి తన బిడ్డా చేరాడు. ఇది తమకు కోలుకోలేని దెబ్బే.

కంటికి రెప్పలా అతన్ని చూసుకోవటం ప్రారంభించింది.

కానీ విధి మరోలా దెబ్బతీసింది ఆత్రేయని డెంగ్యూ ఫీవర్ రూపంలో. అది అతన్ని పీల్చి పిప్పి చేసింది. ఎలాగో అందులోంచి బయటపడ్డాడు. కానీ మానసికంగా అతనికి తగిలిన దెబ్బ నుంచీ మాత్రం కోలుకోలేక పోయాడు. అసలే సున్నిత మనస్తత్వం. దానికి తోడు ఆమెపై పెంచుకున్న ప్రేమ విరహవేదన గా మారటంతో తట్టుకోలేకపోయాడు. ఆ పిచ్చి తోనే ఆత్మహత్య చేసుకోబోయాడు.చివరి నిమిషంలో అక్కడి నర్సు అతన్ని కాపాడింది.ఆమె కాపాడకపోతే అతను చనిపోయే వాడే.ఒక దీపం ఆరిపోయేది.అసలే డబ్బు పోయిన బాధలో ఉండి నానా ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ఇలా!

ఇక తమ జీవితాలు ఇంతేనా అని దిగులుపడిపోయింది. లోలోపల మధనపడిపోతోంది తల్లి హైమావతి.

ఇంట్లో పని.వంట పని, బయట పని తో చెల్లి చామంతి కూడా నలిగిపోతోంది.ఎవరికీ ఏమీ తోచటం లేదు.

ఆత్రేయ ఎలా ఎప్పుడు మనుషుల్లో పడతాడో అర్థం కాక ఇద్దరు తల్లడిల్లిపోయారు. అది జరగని పని అని అర్థమవుతోంది.

కానీ ఒక్కోసారి ఊహించనివి జరుగుతూ ఉంటాయి. అలాగే నర్స్ 'స్వచ్ఛ 'సహకారంతో మళ్లీ మనుషుల్లో పడ్డాడు ఆత్రేయ. కానీ తగిలిన గాయం మాత్రం మానలేదు. స్వచ్ఛ పనిచేసే ఆస్పత్రిలో డాక్టర్ కి ఈ విషయం అంతా చెప్పి ఆత్రేయ కి ఇంటి దగ్గర ట్రీట్మెంట్ ఇచ్చేట్లు ఒప్పించింది.అలా కాస్త డబ్బు వెసులుబాటు జరిగింది ఆమె ద్వారా.

అలా ఆ ఇంటితో, వారితో పరిచయం పెంచుకున్న డాక్టర్ ముకుంద కృష్ణ చామంతిని ఇష్టపడటం ప్రారంభించాడు.

అది పెళ్ళికి దారితీసింది. ఆమెనే చేసుకుంటా నని ముందుకు వచ్చాడు. పైసా కట్నం లేకుండా! పెళ్లి ఖర్చు కూడా తనే పెట్టుకుంటాను అన్నాడు. ఇక హైమావతి ఆనందానికి అవధులు లేవు. అదే సమయంలో స్వచ్ఛ ఆత్రేయ కూడా ఒకరినిఒకరు ఇష్టపడుతున్నారన్న శుభవార్త కూడా ఆమె చెవిన పడింది.

అంధకారంగా మారిన ఆ ఇంటిలో దీపాన్ని వెలిగించిన ఘనత దక్కింది ఆ ఇద్దరికీ.

ఇప్పుడు ఆ ఇల్లు నందనవనం.


# Red Carpet Inn & Suites, Hazleton, P.A.


## 1221 North Church Street, Hazleton, PA, 18202


Visit our very nice hotel, value for your money, located in Hazleton, PA
Every room comes with a TV, Fridge, microwave and ample parking.
Free High speed internet, Fitness center and continental breakfast.
Meeting and Banquet rooms available. Bar and Restaurant located onsite.
Very close to the routes 80 and 81. Very close to White water rafting,
Jim Thorpe, Jack Frost and Big boulder skiing
and close to Valmont and Humboldt industrial Parks.

**Tel: 570-455-2061**





తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society, Inc.
www.tfas.net
శ్రీ శార్వరి నామ సంవత్సర సాహితీ కదంబం
స్వీయ కవితలు, పద్య పఠనం
కవి సమ్మేళనం (స్థానిక కవులు),
అవధాని శ్రీ పార్వతీశ్వర శర్మ, అవధాని శ్రీ తాతా సందీప్ శర్మ గార్ల పద్య పఠనం
ఏప్రిల్ 26, 2020 (ఆదివారం) ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12 వరకు EST
Zoom Meeting : https://us04web.zoom.us/j/6100698089
Meeting ID: 610 069 8089, Password: 197316
మీరు స్వీయ కవితలు చదవదలచు కొంటే ఆ వివరాలను మాకు
ఈమెయిల్ tjarticles@tfas.net కు పంపించండి
ముఖ్య అతిథులు
"శతావధాని" డాక్టర్ రాంభట్ల
పార్వతీశ్వర శర్మ
"అవధాని" శ్రీ తాతా
సందీప్ శర్మ
For more details contact:
Sudhaker Uppala 732 491 6503
Ranga Rao Madisetty 973 207 0132
Madhu Rachakulla 913 220 9172
Renu Tadepalli 848 248 7285
Damu Gedala 856 577 7112
Prameela Gopu 732 670 6575
Venu Yeluri 908 397 7914
Jyothi Gandi 732 208 9599
Usha Darisipudi 732 718 4184


తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society, Inc.
www.tfas.net
COVID-19 : Current Situation/Updates
by Physicians from TFAS
On April 14, 2020 (Tuesday)
from 8pm to 9pm
Register by accessing
www.tfas.net
Please join in and listen and get benefitted from the discussion with professionals.
You can send your questions while registering.
Presents in association with
TV ASIA
TELUGU HD
View Live Telecast @
www.youtube.com/tvasiatelugu
You can watch TV Asia Telugu on
YouTube sling
You can also send your questions to info@tvasiatelugu.com before show starts
Doctors Panel
Dr. Sunita Kanumury MD ,FACAAI.
Private Practice Allergy and Immunology
Past President of AAPI (American Association Of Physicians of Indian origin) NJ
(Dr. Sunita served as TFAS Trustee and Advisor)
Dr. Nirmala Tummalapenta, MD
Trained at New York Presbyterian Brooklyn Methodist Hospital
Medical Director: Boulevard Healthcare; Attending: Montefiore Medical Center
Geriatric Private Practitioner: Tender Medical Care New York
Dr. Uma Kanikicharla, MD, PCMD,AAP, ABP
Practicing Pediatrician, Mahi pediatrics
For more details contact:
For registration visit: www.tfas.net
Sudhaker Uppala 732 491 6503
Ranga Rao Madisetty 973 207 0132
Madhu Rachakulla 913 220 9172
Renu Tadepalli 848 248 7285
Damu Gedala 856 577 7112
Prameela Gopu 732 670 6575
Venu Yeluri 908 397 7914
Jyothi Gandi 732 208 9599
Usha Darisipudi 732 718 4184


WEBINAR ON
COPING WITH COVID-19,
HEALTHCARE and JOBS/IMMIGRATION
In Association with
GK TV
Telugu Fine Arts Society
LIVE Webinar
Dr. Sabitha Eppanapally
Nephrology
California - USA
Dr. Madhavi Sthotrabhashyam
Covid19 Officer, Hyderabad
Ms. Janetha Kancharla
Immigration Attorney
Washington D.C - USA
Swamy Sriperumbudur
Session Moderator
CIO – INFOMERICA
YouTube LIVE: http://www.youtube.com/GKTVusa
Date: Saturday May 2, 2020
Time: 11am EDT; 10am CDT; 8am PDT; and 8:30PM IST
Topic: COPING WITH COVID19
Healthcare and Jobs/Immigration
Note: Please join the session on time. There will be a Q&A Session after the presentation by panelists.


TV ASIA
TELUGU HD
in association with
Telugu Fine Arts Society
Live Telecast of
COVID – 19 & IMPACT ON VISA STATUS
On Friday,
April 10, 2020
5:00pm to 6:00 pm(EST)
Host
Manya
Actress
Speaker
Ms. Kavita Ramasami
Attorney
Law Offices of Ramasami Kavitha
Watch Live on
www.youtube.com/tvasiatelugu
Email your questions for the Attorney to info@tvasiatelugu.com before the show
Topics
• Potential H1B Layoff's and status issues
• Visa compliance for H1B's working on remote projects
• Universities and School Closures : F1 student status issues
• USCIS & Travel Closures: Impact of visa extension for parents
• Emergency travel to India
• Issues related to Expired Passports, EAD renewals
You can watch TVASIA Telugu channel on:
sling WORLD BBTV
TVASIATELUGU
TVASIATELUGUUSA
TVASIATELUGU
TVASIATELUGUUSA






Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

# Thanks to all our Supporters/Sponsors



# Thanks to all our Media Partners